మంగళవారం

22-10-2024

విజయవాడ ప్రచురణ

సంపుటి : 73, సంచిక : 121

పేజీలు : 6+8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

బ్రెజిల్ అధ్యక్షుడి తలకు గాయం

బ్రెసిలియా: బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తన నివాసంలోని స్నానాల గదిలో జారిపడ్డారు. దీంతో ఆయన తలకు గాయమైంది. లూలా ప్రస్తుతం బాగానే ఉన్నారని, ఆయన తలకు కుట్లు వేయాల్సి వచ్చిందని డాక్టర్ రాబర్టో కలీల్ చెప్పారు. ఆయన చిన్న మెదడులో రక్తస్రావం అయిందని తెలిపారు. దీంతో వారం మొత్తం లూలాకు పరీక్షలు చేయాల్సి ఉందన్నారు. తర్వాతి రోజుల్లో గాయం మరింత తీవ్రమవుతుంది కాబట్టి క్రమం తప్పకుండా పరిశీలించాల్సి ఉంటుందని వెల్లడించారు. అయితే అధ్యక్షుడి ఆరోగ్యం గురించి ఆందోళన అవసరం లేదని, రోజువారి కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. తాత్కాలికంగా ఎక్కువ దూరం విమాన ప్రయాణం మంచిది కాదని తెలిపారు. ఈ నేపథ్యంలో రష్యాలో జరుగనున్న బ్రిక్స్ సదస్సుకు అధ్యక్షుడు లూలా దూరం కానున్నారు.

వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్ష ఎంపీల నిరసన

న్యూఢిల్లీ: మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సోమవారం పార్లమెంటరీ ప్యానెల్ సమావేశంలో వక్ఫ్ బిల్లుపై ఎంపీల ప్రశ్నలను నివృత్తి చేసింది. ఈ సందర్భంగా కొన్ని సంవత్సరాల్లో మంత్రిత్వ శాఖ సంప్రదింపులు కొత్త చట్టాన్ని ఎన్నడూ కోరలేదని కొందరు ప్రతిపక్ష సభ్యులు వాదించారు. 1976లో రాజ్యాంగంలో 'సోషలిస్ట్', 'లౌకిక' పదాలను చొప్పించడాన్ని సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్ల సమూహం కూడా ఈ సమావేశంపై నీలినీడలు కమ్మేలా

- మిగతా 2 లో

భారత్-చైనా చర్చల్లో ముందడుగు

సరిహద్దు గస్తీపై ఒప్పందం

న్యూఢిల్లీ: భారత్-చైనా సరిహద్దులో వాస్తవాధీన రేఖ వెంబడి నెలకొన్న వివాదం పరిష్కారం కోసం రెండు దేశాల సైనికాధికారుల చర్చల్లో ముందడుగు పడింది. బలగాల ఉపసంహరణకు సంబంధించి రెండు దేశాలూ ఓ ఒప్పందానికి వచ్చాయని, వాస్తవాధీన రేఖ వెంట గస్తీ పునఃప్రారంభించడానికి అంగీకరించాయని భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. అక్టోబర్ 22-23న రష్యాలో జరగనున్న బ్రిక్స్ 16వ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ వెళ్లనున్న తరుణంలో తాజా పరిణామం చోటుచేసుకుంది. "భారత్-చైనా

- మిగతా 2 లో

కశ్మీర్ ఎప్పటికీ పాకిస్తాన్‌గా మారదు

ఎన్‌సీ నేత ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని గగన్‌గిర్‌లో ఉగ్ర దాడిని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా సోమవారం తీవ్రంగా ఖండించారు. భారతదేశంలో ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేయడం ఆపాలని పాకిస్తాన్‌కు సూచించారు. న్యూఢిల్లీతో సత్సంబంధాలు కావాలంటే పాకిస్తాన్ ఈ చర్యలకు స్వస్తి చెప్పాల్సి ఉంటుందన్నారు. ఇటీవల కేంద్రపాలిత ప్రాంతంలో తమ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

2,684 కోట్లతో దీపం

మహిళలకు దీపావళి కానుకగా అమలు

- ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు అందజేత
- 24 నుంచి బుకింగ్ ప్రక్రియ... 31 నుంచి లబ్ధిదారులకు పంపిణీ
- సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు మరో సంక్షేమ పథకానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 5 సంతకాలతో మేనిఫెస్టో హామీలను, అన్న క్యాంటీన్ వంటి కార్యక్రమాలను అమలులోకి తెచ్చిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాల అమలుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 31వ తేదీ నుంచి దీపావళి సందర్భంగా దీపం పథకాన్ని మహిళలకు అందించనుంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో దీపం పథకం కింద మూడు సిలిండర్లు ఏడాదికి ఉచితంగా ఇస్తామని నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రకటించారు. దీనిలో భాగంగా దీపం పథకాన్ని దీపావళి సందర్భంగా ప్రారంభించనున్నారు. మహిళా సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని... దీపావళి నుంచి సూపర్ సిక్స్ కార్యక్రమాల్లో భాగమైన దీపం పథకం అమలు గొప్ప ముందడుగు అని సీఎం వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంపై సోమవారం వెలగపూడి సచివాలయంలో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఆ శాఖ అధికారులు, చమురు సంస్థలు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత పెట్రోలియం కార్పొరేషన్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రతినిధులతో సీఎం సమీక్షించారు. దీపం పథకం అమలు, విధివిధానాలపై సమీక్ష జరిపారు. ఆర్థిక సమస్యలు ఉన్నా పేదలకు మేలు చేసే సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో అర్హులయిన మహిళలందరికీ పారదర్శక విధానంలో ఈ ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తామని స్పష్టం చేశారు. ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ కలిగి, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని వర్తింప చేయాలన్నారు. ప్రతి నాలుగు నెలల వ్యవధిలో ఎప్పుడైనా ఆయా లబ్ధిదారు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ఈనెల 24 నుంచి బుకింగ్ చేసుకునే ఏర్పాట్లు చేయాలని, 31వ తేదీ నుంచి గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సిలిండర్ తీసుకున్న లబ్ధిదారులకు రెండు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో గ్యాస్ సబ్సిడీని జమ చేయాలని, ఆ విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మహిళలకు ఇంటి ఖర్చులు తగ్గించాలనే ఆలోచనతో ఉమ్మడి రాష్ట్రంలో దీపం పథకం తెచ్చామని, ఇప్పుడు మళ్లీ మూడు గ్యాస్ సిలిండర్ల ద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. వంట గ్యాస్ కోసం వెచ్చించే ఖర్చును గృహిణులు ఇతర అవసరాలకు వాడుకోవచ్చని అన్నారు. అర్హత గల ఏ ఒక్క లబ్ధిదారునికి ఈ పథకం రాలేదనే విమర్శ రాకుండా కట్టుదిట్టంగా కార్యక్రమాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో తొలుత రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గ్యాస్

- మిగతా 2 లో

నేడు, రేపు 'డ్రోన్' సమ్మిట్

పున్నమి ఘాట్‌లో 5,500 డ్రోన్లతో మెగా షో

2లో

ఏపీ పోలీస్ బ్రాండ్ నిలబెట్టాలి

- పోలీసుల సంక్షేమానికి ఏటా రూ.20 కోట్లు
- త్వరలో 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ
- పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సమైక్యాంధ్రప్రదేశ్‌లో, ఆ తర్వాత ఏపీ పోలీసులు దేశంలో ఓ ప్రత్యేక బ్రాండ్ ఉన్న పోలీసులుగా గుర్తింపు సాధించారని... తిరిగి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. నక్సలిజాన్ని, కుల,మత విద్వేషాలు, ఫ్యాక్షనిజం, రౌడీయిజాన్ని ఉక్కుపాదంతో అణచివేసిన ఘనత ఏపీ పోలీసులకే దక్కిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో జీరో క్రైమ్ ఉండాలని, ఎవరైనా నేరాలు చేయాలంటే భయపడే పరిస్థితి రావాలని, దానికోసం ప్రతి ఒక్కరూ సమర్థంగా పనిచేయాలని కోరారు. శాంతి, భద్రతలు అనేవి ప్రభుత్వానికి మొదటి ప్రాధాన్యమని, అలాగే పోలీసు సంక్షేమం అనేది ఈ ప్రభుత్వ బాధ్యత అని చంద్రబాబు స్పష్టం చేశారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. తొలుత పోలీస్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల కంటే పోలీస్ శాఖ అత్యంత కీలకమన్నారు. సమాజ హితం కోసం చేసే కృషిలో పోలీసులు కీలకపాత్ర పోషిస్తున్నారని, ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు రాత్రి పగలూ కష్టపడేది పోలీసులేనని కొనియాడారు. సంఘ విద్రోహ శక్తులు అనేక రూపాల్లో సమాజానికి సవాళ్లు విసిరే సందర్భంలో వాటిని ఎదుర్కొంటూ ప్రజలను కాపాడటంలో పోలీసుల కృషి వెలకట్టలేనిదన్నారు. ఇటీవల విజయవాడ వరదల సమయంలో ప్రజలను కాపాడటంలో విశేష కృషి చేసిన పోలీసులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు, ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు సమయంలో పోలీసులు బాగా పనిచేశారని, శాంతి భద్రతలను కాపాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా దర్శనం చేసుకునేలా కృషిచేశారని ప్రశంసించారు.

పోలీసు వ్యవస్థలో సంస్కరణలు తెచ్చాం

2014 తర్వాత పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చామని, అవసరం మేరకు వాహనాలు, పరికరాలు, సాంకేతిక సౌకర్యాలను అందుబాటులో ఉంచామన్నారు. ఏపీ పోలీస్ అంటే

- మిగతా 2 లో

అమరావతికి హడ్కో రుణం రూ.11వేల కోట్లు

అమరావతి రాజధాని నిర్మాణం కోసం వివిధ బ్యాంకులు,సంస్థలు తమ సహకారం అందించేందుకు అంగీకరిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచ బ్యాంకు,ఆసియా డెవలప్ మెంట్ బ్యాంకు కలిసి 15 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకారం తెలపగా, తాజాగా 11 వేల కోట్ల నిధుల మంజూరుకు హడ్కో అంగీకారం తెలిపింది.

6లో

సీట్ల పంపకంపై ఏకాభిప్రాయం

మహారాష్ట్రలో 210 స్థానాల్లో పోటీపై ఎంవీఏలో కుదిరిన అంగీకారం: సంజయ్ రౌత్ వెల్లడి



న్యూఢిల్లీ: మహారాష్ట్రలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) కూటమిలో సీట్ల పంపిణీ కొలిక్కి వచ్చింది. సీట్ల పంపకాలపై ఎంవీఏ కూటమిలో విభేదాలు వచ్చినట్లు వార్తలొచ్చిన సంగతి విదితమే. శివసేన(యూబీటీ) ఒంటరిగా పోటీ చేస్తుందని పుకార్లు షికార్లు చేశాయి. కాగా వదంతులకు తెరదించుతూ ఆ పార్టీ నేత సంజయ్ రౌత్ కీలక ప్రకటన చేశారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాలపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు గాను 210 స్థానాల్లో పోటీపై మహా వికాస్ అఘాడి ఏకాభిప్రాయానికి వచ్చిందని... ఈ పురోగతి ప్రధాన విజయంగా భావిస్తున్నట్లు రౌత్ ప్రకటించారు. మహారాష్ట్రను దోచుకుంటున్న శక్తులను ఓడించడమే ఇండియా ఐక్యసంఘటన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. "210 సీట్లపై ఏకాభిప్రాయానికి వచ్చాం. ఇది ఒక ముఖ్యమైన విజయం. ఉమ్మడి శక్తిగా ఎన్నికల్లో పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మహారాష్ట్రను లూటీ చేసే శక్తులను ఓడిస్తాము." అని రాజ్యసభ ఎంపీ, శివసేనకు కీలక వ్యూహకర్త అయిన సంజయ్ రౌత్ విలేకరులతో అన్నారు. ఎంవీఏలో శివసేన (యూబీటీ), ఎన్సీపీ (శరద్ పవార్) కాంగ్రెస్ ఉన్నాయి. మరోవైపు పాలక మహాయుతిలో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, బీజేపీ, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కూటమి ఉంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 20న జరగనున్నాయి. నవంబర్ 23న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ప్రస్తుత మహారాష్ట్ర అసెంబ్లీ పదవీ కాలం నవంబర్ 26తో ముగుస్తుంది. ఇండియా ఐక్యసంఘటన-ఎన్డీఏ కూటమి తలపడుతున్నాయి. నువ్వానేనా? అన్నట్టుగా దీటైన అభ్యర్థులను బరిలోకి దింపుతున్నారు. విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి.

ఈసీ సాయంతో బీజేపీ ఓటర్ల జాబితా మోసం

మహారాష్ట్ర, జార్ఖండ్ రాష్ట్రాలు శాసనసభ ఎన్నికలకు సిద్ధమవుతున్న తరుణంలో సంజయ్ రౌత్ బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. రెండు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలను ట్యాంపరింగ్ చేశారని ఆరోపించారు. ముంబైలో విలేకరుల సమావేశంలో రౌత్ మాట్లాడుతూ మహారాష్ట్ర ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో బీజేపీ ఎన్నికల మోసానికి పాల్పడుతోందని తెలిపారు. రౌత్ ప్రకారం, బీజేపీ పోటీ చేస్తున్న ప్రతి నియోజకవర్గంలో లోక్‌సభ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) కి మద్దతు

- మిగతా 2 లో

లడ్డూ కల్తీ వ్యాఖ్యలపై పవన్‌కు సమన్లు

నవంబరు 22న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత కొణిదెల పవన్ కల్యాణ్‌కు హైదరాబాద్ సివిల్ కోర్టు సోమవారం సమన్లు జారీ చేసింది. తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై పవన్ కల్యాణ్ ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేశారని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో న్యాయవాది ఇమ్మనేని రామారావు పిటీషన్ దాఖలు చేశారు. శాస్త్రీయమైన ఆధారాలు లేకుండా శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతుమాంసంతో చేసిన నెయ్యిని కలిపారని పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు, హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని పిటీషన్‌లో పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కల్యాణ్ తన హోదా మరచి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని, ఇంటర్‌నెట్‌లో ఆయన మాట్లాడిన వీడియోలు డిలీట్ చేయాలని

- మిగతా 2 లో

డీఎస్సీపైనే ఆశలు

4 లక్షలకుపైగా నిరుద్యోగుల పడిగాపులు

- 16 వేలకు పైగా టీచర్ పోస్టుల భర్తీకి సన్నాహాలు
- డిసెంబరులోగా నోటిఫికేషన్ వచ్చే అవకాశం
- పోస్టులు పెంచాలంటున్న అభ్యర్థులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారంతో ఏపీటెట్-2024(జులై) సెషన్ పరీక్షలు ముగిశాయి. ప్రస్తుతం టెట్ పరీక్షలు రాసిన అభ్యర్థులు, అంతకుముందు అర్హత సాధించిన వారంతా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జూన్‌లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకిగాను డీఎస్సీ దస్త్రంపై తొలి సంతకం చేశారు. వెనువెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుందని నిరుద్యోగులు ఆశించారు. ఇంతలో టెట్ నోటిఫికేషన్‌కు వ్యవధి చాలదన్న అభ్యర్థనలు రావడంతో దానిని ప్రభుత్వం పొడిగించింది. ఈనెల 3వ తేదీ నుంచి 21వ తేదీ వరకు టెట్ పరీక్షల ప్రక్రియ పూర్తయింది. టెట్ పరీక్షా ఫలితాలు వచ్చిన వెంటనే నవంబరు/డిసెంబరులో డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చే అవకాశముందని అభ్యర్థులు ఆశిస్తున్నారు. సీఎం చంద్రబాబు ఇటీవల రాయలసీమ జిల్లాల పర్యటనలో నవంబర్‌లో డీఎస్సీ ప్రకటన ఇస్తామని ప్రకటించిన విషయం విదితమే. అన్నీ అనుకూలించి డీఎస్సీ-2024కు నవంబరు/డిసెంబరులో నోటిఫికేషన్ విడుదలైతే.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత నియామక ప్రక్రియ ఉంటుంది. ఈ ఏడాదిలోగా డీఎస్సీ రాకపోతే..నోటిఫికేషన్ వచ్చే ఏడాదికి వాయిదా పడుతుంది.

ప్రతిష్ఠాత్మకంగా డీఎస్సీ... ప్రభుత్వం కసరత్తు

సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిన హామీకి అనుగుణంగా ప్రతిష్ఠాత్మకంగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపడుతున్నట్లు తెలిసింది. ఈ డీఎస్సీలో ఎలాంటి న్యాయ వివాదాలు తలెత్తకుండా సమర్థంగా నియామక ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. టెట్, డీఎస్సీ మధ్య ఎక్కువ సమయం ఉండేందుకు ఇప్పటికే అభ్యర్థులకు అవకాశం ఇచ్చారు. డీఎస్సీ ప్రకటనపై ఒక స్పష్టత రావడంతో అభ్యర్థులు టెట్‌తోపాటు డీఎస్సీ సన్నద్ధతపైనా దృష్టి పెట్టారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని ప్రైవేట్ సంస్థల్లో వేలాది రూపాయలు ఖర్చుచేసి శిక్షణ పొందుతున్నారు. కొత్త ప్రభుత్వం కొలువు తీరినప్పటి నుంచి ప్రైవేట్ ఉద్యోగాల్ని మానేసి శిక్షణపైనే దృష్టి పెట్టారు. డీఎస్సీ పరీక్షల కోసం దాదాపు 4లక్షల మంది నిరుద్యోగ అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేవలం 6,100 పోస్టులతోనే ఎన్నికల సమయంలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీజేశారు. న్యాయపరమైన సమస్యలు తలెత్తడం, ఆ తర్వాత

- మిగతా 2 లో

ఆదుకుంటాం... ఆందోళన వద్దు

డయేరియా బాధితులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భరోసా

6లో

తూర్పు తీర రాష్ట్రాలకు తుపాను ముప్పే

నేడు వాయుగుండంగా మారే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: తూర్పు తీర రాష్ట్రాలకు తుపాను ముప్పు పొంచి ఉంది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది మంగళవారం వాయుగుండంగా మారే అవకాశం ఉందని

- మిగతా 2 లో

భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా?

పిటిషనర్ సుబ్రహ్మణ్యస్వామికి సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ: సోషలిస్ట్ (సామ్యవాద), సెక్యులర్ (లౌకిక) పదాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే కీలకమైనవని ఎన్నో తీర్పులు నొక్కిచెప్పాయని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పీఠిక నుంచి ఈ పదాలను తొలగించాలని కోరుతూ బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్, న్యాయవాది విష్ణు శంకర్ జైన్ తన వాదనలు వినిపిస్తూ... రాజ్యాంగానికి 1976లో చేపట్టిన 42వ సవరణపై పార్లమెంట్‌లో చర్చే జరగలేదన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ... ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని... వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో కోర్టులు చాలాసార్లు ఇవి రాజ్యాంగంలోని ప్రాథమిక భాగాలుగా అభివర్ణించినట్లు వెల్లడించారు. 'సోషలిజం అంటే... అందరికీ సమాన అవకాశాలు ఉండాలని, సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది, మీరు దీనిని మరో రకంగా

- మిగతా 2 లో

చెఫ్ అవతారం ఎత్తిన ట్రంప్

వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికలతో అమెరికాలో రాజకీయాలు వేడెక్కాయి. డెమోక్రాట్స్, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ కొనసాగుతోంది. గెలుపే లక్ష్యంగా ఇద్దరు అభ్యర్థులూ వ్యూహాత్మకంగా ముందుకు వెళు తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించుకుంటున్నారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా రిపబ్లికన్‌పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ఓ రెస్టారెంట్‌లో పనిచేశారు. పెన్సిల్వేనియాలోని మెక్‌డొనాల్డ్స్ స్టోర్‌లో ఆదివారం కొద్దిసేపు పని చేశారు. అక్కడ ఫ్రెంచ్ ఫ్రైస్ తయారు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. నవంబర్ 5న జరగనున్న అధ్యక్ష ఎన్నికల కోసం ఇరు అభ్యర్థులూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంలో భాగంగా యుక్తవయసులో ఉన్నప్పుడు తాను ఓ మెక్‌డొనాల్డ్స్‌లో పని చేశానని డెమోక్రాటిక్‌పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తెలిపారు. ఈ నేపథ్యంలోనే ట్రంప్.. ఓ మెక్‌డొనాల్డ్స్ స్టోర్‌లో పనిచేసి ఈ విధంగా కౌంటర్ ఇచ్చారు.

ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో బ్రిటన్ రాజుకు అవమానం

సిడ్నీ: బ్రిటన్ రాజు కింగ్ ఛార్లెస్-3 ఆస్ట్రేలియా పార్లమెంట్‌లో అవమానానికి గురయ్యారు. సోమవారం ఆయన ఆస్ట్రేలియా పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఛార్లెస్ మాట్లాడటం పూర్తయిన వెంటనే స్థానిక ఆదివాసీ సెనెటర్ లిడియా థోర్పే రాచరికానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. "మా భూమిని తిరిగి ఇచ్చేయండి. మా నుంచి దోచుకొన్నవి మొత్తం వాపస్ ఇవ్వండి. ఇది మీ భూమి కాదు.. మీరు మా రాజు కాదు. ఆస్ట్రేలియా ఆదివాసీలపై ఐరోపా వలసదారులు నరమేధానికి పాల్పడ్డారు" అని ఆమె దాదాపు నిమిషం పాటు పెద్దపెద్దగా కేకలు వేశారు. వలస విధానాన్ని థోర్పే ఎప్పుడూ వ్యతిరేకిస్తారని పేరుంది. 2022లో థోర్పే ప్రమాణ స్వీకార సమయంలో కూడా వలస రాజ్యపాలకురాలంటూ క్వీన్ ఎలిజిబెత్-2ను అభివర్ణిస్తూ ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో నాటి ఛాంబర్ ప్రెసిడెంట్ సు లిన్స్ ఆమెను ఉద్దేశించి "సెనెటర్ థోర్పే.. మీరు ప్రమాణస్వీకారం కార్డులో ప్రచురించిన అంశాన్ని మాత్రమే చదవాలి" అని సరిచేశారు. ఆస్ట్రేలియా రాణి హోదా నుంచి క్వీన్ ఎలిజిబెత్-2ను తప్పించి... పార్లమెంట్ సభ్యులు ఎన్నుకొన్నవారిని నియమించేలా 1999లో ఓటింగ్ జరిగింది. నాడు స్వల్ప మెజార్టీతో ఈ తీర్మానం వీగిపోయింది. మరోవైపు దేశంలో ఆదివాసీ కన్సల్టేటివ్ అసెంబ్లీ ఏర్పాటుకు తీర్మానాన్ని కూడా 2023లో పార్లమెంట్ భారీ మెజార్టీతో తిరస్కరించింది. ఆస్ట్రేలియా దాదాపు 100 ఏళ్లకు పైగా బ్రిటన్ వలస రాజ్యంగా ఉన్న సంగతి తెలిసిందే.

ఇరాన్ పారిపోయిన హెజ్బొల్లా డిప్యూటీ చీఫ్



బీరుట్: లెబనాన్‌పై ఇజ్రాయిల్ దళాలు భీకర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. హెజ్బొల్లా రాజకీయ, సైనిక కేంద్రాలే లక్ష్యంగా వరుస దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లా సహా కీలక నేతలు చనిపోయిన నేపథ్యంలో హెజ్బొల్లా డిప్యూటీ చీఫ్‌గా వ్యవహరిస్తున్న నయీమ్ ఖాసిమ్ ప్రాణ భయంతో లెబనాన్‌ను వీడినట్లు తెలిసింది. ఆయన ఇరాన్‌కు పారిపోయినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. నయీమ్ అక్టోబర్ 5నే బీరుట్‌ను వీడినట్లు ఇరాన్ వర్గాలను ఊటంకిస్తూ యూఏఈకి చెందిన ఎరెమ్ న్యూస్ నివేదించింది. లెబనాన్, సిరియా పర్యటనకు వెళ్లిన ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరగచి విమానంలోనే ఆయన బీరుట్ నుంచి ఇరాన్‌కు వెళ్లినట్లు తెలిపింది. ఇజ్రాయెల్ ఆయనను హత్య చేసే అవకాశం ఉందన్న ఇస్లామిక్ రిపబ్లిక్ నేతల హెచ్చరికలతోనే నయీమ్ లెబనాన్‌ను వీడినట్లు పేర్కొంది. కాగా సెప్టెంబర్ 27న ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో హెజ్బొల్లా అధినేత హసన్ నస్రల్లా హతమైన విషయం తెలిసిందే. నస్రల్లా మృతి తర్వాత నయీమ్ ఖాసిమ్ మూడుసార్లు ప్రసంగించారు. అందులో ఒకటి బీరుట్ నుంచి కాగా, మిగతా రెండు టెహ్రాన్ నుంచి మాట్లాడారు. నస్రల్లా మరణం తర్వాత ఇజ్రాయిల్‌కు నయీమ్ టార్గెట్‌గా ఉన్నాడు. దీంతో ఆయన ప్రాణ భయంతో లెబనాన్‌ను వీడినట్లు సదరు కథనాలు వెల్లడిస్తున్నాయి. మిలిటెంట్ గ్రూపుల్లో ఒకటైన షియా రాజకీయ పార్టీ వ్యవస్థాపక సభ్యుల్లో నయీమ్ ఖాసిమ్ ఒకరు. ఇజ్రాయిల్ లక్ష్యంగా చేసుకుందన్న భయంతో నస్రల్లా అజ్ఞాతంలోకి వెళ్లిపోయిన వేళ.. సభలు, ఇంటర్వ్యూలతోపాటు ఇతర బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. నస్రల్లా మరణం తర్వాత హెజ్బొల్లా చీఫ్ బాధ్యతలు ఆయనకు అప్పగించినట్లు సమాచారం.

దాడికి ముందు సొరంగంలో సిన్వర్

వీడియో దృశ్యాలు విడుదల

గాజా: ఇటీవల ఇజ్రాయిల్ జరిపిన డ్రోన్ దాడిలో.. హమాస్ చీఫ్ యహ్యా సిన్వర్ మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే అక్టోబర్ 7వ తేదీన జరిగిన దాడికి సంబంధించిన వీడియో కూడా విడుదల చేశారు. ఆ దాడికి ముందు సిన్వర్ తన కుటుంబంతో కలిసి సొరంగాల నుంచి వెళ్తున్న సమయంలో తీసిన కొన్ని వీడియోలు కూడా విడుదలయ్యాయి. హమాస్ చీఫ్ సిన్వర్ తన భార్య , పిల్లలతో కలిసి వెళ్లాడు. నీళ్లు, తలదిండు, మంచాలను తమతో తీసుకెళ్లారు. సొరంగానికి పారిపోయే ముందు ఓ టెలివిజన్ సెట్‌ను కూడా తీసుకెళ్లినట్లు సమాచారం. ఖాన్ యూనిస్‌లో ఉన్న ఇంటి వద్ద అతను టన్నెల్‌లో కనిపించాడు. సిన్వర్ భార్య సొరంగం నుంచి వెళ్తున్న దృశ్యాలు విడుదల య్యాయి. అయితే ఆ సమయంలో ఆమె వద్ద ఖరీదైన చేతి బ్యాగును గుర్తించారు. హెర్మెస్ బ్రాండ్‌కు చెందిన ఆ బ్యాగు ఖరీదు సుమారు రూ.26 లక్షలు ఉంటుందని అంచనా వేస్తున్నారు.

హమాస్ వల్ల గాజా ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, సిన్వర్ కుటుంబం మాత్రం విలాసవంతమైన జీవితాన్ని గడుపుతోందని ఇజ్రాయిల్ ఆరోపించింది. హెర్మెస్ బ్యాగుతో వెళ్తున్న సిన్వర్ భార్య ఫోటో స్క్రీన్‌షాట్‌ను ఇజ్రాయిల్ షేర్ చేసింది. ఆ బ్యాగు డిజైన్ హెర్మెస్ బిర్కిన్ 40 బ్లాక్ టోగో గోల్డ్ హార్డ్‌వేర్ ఎడిషన్‌కు చెందినట్లు భావిస్తున్నారు. ఇజ్రాయిల్ చేసిన ఆరోపణలను ఇంత వరకు పాలస్తీనా ధ్రువీకరించలేదు.

భారత్-చైనా చర్చల్లో ముందడుగు

(మొదటిపేజీ తరువాయి)

సరిహద్దులో వాస్తవాధీన రేఖ వెంబడి గస్తీ పునఃప్రాంభంపై ఇరు దేశాల మధ్య ఓ ఒప్పందం కుదిరింది. అనేక వారాలుగా జరుపుతున్న చర్చల ఫలితంగా ఈ పురోగతి చోటుచేసుకుంది. బలగాల ఉపసంహరణ, 2020లో తలెత్తిన సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తుంది" అని భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. అయితే, బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక చర్చలు ఉంటాయా అన్న ప్రశ్నకు బదులిస్తూ.. భారత్-చైనా మధ్య దౌత్య, సైనిక మార్గాల్లో చర్చలు జరుగుతున్నాయని, అయినప్పటికీ ద్వైపాక్షిక చర్చలకు సంబంధించి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని అన్నారు. భారత్-చైనా సరిహద్దులోని గల్వాన్ లోయలో 2020లో చోటుచేసుకున్న ఘర్షణ తర్వాత ఇరుదేశాల మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. అక్కడ రెండు దేశాలు భారీ స్థాయిలో బలగాలను మోహరించాయి. భారత్ కూడా దాదాపు 68వేల మంది సైన్యాన్ని సరిహద్దుకు తరలించింది. వాస్తవాధీన రేఖ వెంట నెలకొన్న ఈ ప్రతిష్టంభనపై ఇరుదేశాల సైనిక ఉన్నతాధికారులు అనేక దఫాల్లో చర్చల్లో పురోగతి కనిపించడం సానుకూలాంశంగా భావిస్తున్నారు.

కశ్మీర్ ఎప్పటికీ పాకిస్తాన్‌గా మారదు

(మొదటిపేజీ తరువాయి)

చేసిన ఫరూక్ అబ్దుల్లా, కశ్మీర్ ఎప్పటికీ పాకిస్తాన్‌గా మారదని స్పష్టం చేశారు. 'భారత్‌తో సత్సంబంధాలు కావాలంటే దీనికి స్వస్తి పలకాలని పాక్ నాయకత్వానికి చెప్పాలనుకుంటున్నాను. కశ్మీర్ పాకిస్తాన్ నహీ బనేగా (కశ్మీర్ ఎప్పటికీ పాకిస్తాన్‌గా మారదు). ఇక్కడి ప్రజలు గౌరవంగా జీవించాలనుకుంటున్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేసే సమయం వచ్చింది. భారత్ హెచ్చరికలను పాకిస్తాన్ పెడచెవిన పెడితే ఫలితాలు చాలా తీవ్రంగా ఉంటాయి' అని హెచ్చరించారు. '75 ఏళ్లుగా పాకిస్తాన్‌ను సృష్టించలేకపోతే ఇప్పుడు ఎలా సాధ్యం? ఉగ్రవాదాన్ని తుదముట్టించే సమయం వచ్చింది. లేకుంటే ఫలితాలు చాలా తీవ్రంగా ఉంటాయి. మన అమాయక ప్రజలను చంపేస్తే చర్చలు ఎలా జరుగుతాయి?' అని ఆయన ప్రశ్నించారు.ఆదివారం గందర్‌బాల్ జిల్లాలోని శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై సొరంగం నిర్మాణ స్థలంపై ఉగ్రవాదులు దాడి చేయడంతో ఒక వైద్యుడు, ఆరుగురు కార్మికులు మరణించారు. 'ఈ దాడి చాలా దురదృష్టకరం. వలస వచ్చిన పేద కూలీలు, ఒక వైద్యుడు ప్రాణాలు కోల్పోయారు. దీని వల్ల ఉగ్రవాదులకు ఏమి లభిస్తుంది? వారు ఇక్కడ పాకిస్తాన్‌ను సృష్టించగలరని వారు భావిస్తున్నారా. మేము దీనిని ఒక వ్యక్తికి ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాము. చివరికి మనం కష్టాల నుంచి ముందుకు సాగవచ్చు' అని అబ్దుల్లా చెప్పారు.

సీట్ల పంపకంపై ఏకాభిప్రాయం

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చిన సుమారు 10 వేల మంది ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించి, వారి స్థానంలో బోగస్ ఓటర్లతో భర్తీ చేస్తున్నారు. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో ఓటరు జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయని, హర్యానాలో కూడా ప్రయత్నాలు జరిగాయని, మహారాష్ట్రలో బీజేపీ ఎన్నికల్లో ఓడిపోబోతోందని, అందుకే ఈసీ సాయంతో వారు ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. బీజేపీ పోటీ చేస్తున్న ప్రతి నియోజకవర్గంలోనూ లోక్‌సభలో ఎంవీఏకు ఓటు వేసిన 10,000 మంది ఓటర్లను తొలగించి, వారి స్థానంలో 10,000 మంది బోగస్ ఓటర్లతో మన గెలుపు అవకాశాలను తగ్గించారని తెలిపారు.

లడ్డూ కల్తీ వ్యాఖ్యలపై పవన్‌కు సమన్లు

(మొదటిపేజీ తరువాయి)

న్యాయవాది తన పిటిషన్‌లో కోరారు. తిరుపతి లడ్డూ వివాదంలో సమగ్ర దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఇప్పటికే స్వతంత్ర సిట్ ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, మరోసారి తిరుపతి ప్రసాదంపై పవన్ కల్యాణ్ ఇలాంటి వాఖ్యలు చేయకుండా గ్యాగ్ ఆర్డర్ ఇవ్వాలని రామారావు తన పిటిషన్‌లో కోర్టును కోరారు. దీనిపై స్పందించిన సిటీ సివిల్ కోర్టు పవన్ కల్యాణ్‌కు సమన్లు జారీ చేసింది. నవంబర్ 22న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. అలాగే తెలంగాణ సీఎస్‌కు సైతం కోర్టు నోటీసులు జారీ చేసింది.

ఆ కేసును క్వాష్ చేయండి: అల్లు అర్జున్ పిటిషన్

రాష్ట్ర ఉన్నతన్యాయస్థానంలో సినీనటుడు అల్లు అర్జున్ సోమవారం పిటిషన్ దాఖలు చేశారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా నంద్యాలలో తనపై నమోదైన కేసును క్వాష్ చేయాలని ఆయన కోరారు. సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్న సమయంలో, అనుమతి లేకుండా జనసమీకరణ చేపట్టారంటూ అల్లు అర్జున్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆయన తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది.

నేడు, రేపు 'డ్రోన్' సమ్మిట్

- పున్నమి ఘాట్‌లో 5,500 డ్రోన్లతో మెగా షో
- ముసాయిదా డ్రోన్ పాలసీ ఆవిష్కరించనున్న సీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రెండు రోజుల పాటు నిర్వహించే అమరావతి డ్రోన్ సమ్మిట్ -2024కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.సదస్సులో పాల్గొనడానికి ఉత్సుకత ప్రదర్శిస్తూ దాదాపు 6,929 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు పున్నమి ఘాట్ వద్ద 5500 డ్రోన్లతో మెగా డ్రోన్ షో నిర్వహిస్తున్నామని రాష్ట్ర పెట్టుబడులు, మౌలికసదుపాయాల శాఖ కార్యదర్శి ఎస్. సురేశ్‌కుమార్,డ్రోన్ కార్పొరేషన్ ఎండీ కె. దినేశ్ కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేశామని, ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని తిలకించవచ్చని తెలిపారు. పున్నమి ఘాట్ వద్ద 8 వేల మందికిపైగా కూర్చొని తిలకించే ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే నగరంలో పలు చోట్ల డిజిటల్ తెరలు ఏర్పాటు చేశామని వాటి ద్వారా డ్రోన్ షో, సదస్సును ప్రత్యక్ష ప్రసారం చేస్తామని చెప్పారు. సచివాలయంలో సోమవారం ఆయన మీడియాకు డ్రోన్ సమ్మిట్ వివరాలు తెలియజేశారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ఈ సదస్సును ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభిస్తారని, ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు కూడా పాల్గొంటారన్నారు. సదస్సులో రాష్ట్ర ప్రభుత్వం క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, తిరుపతి ఐఐటీతో రెండు అవగాహన ఒప్పందాలు చేసుకుంటుందన్నారు. క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో చేసుకున్న ఎంఓయూ వల్ల ఏపీకి డ్రోన్ రిమోట్ పైలట్ లైసెన్స్ సర్టిఫికేట్ జారీ చేసే అవకాశం కలుగుతుందన్నారు. రాష్ట్రంలో 20 వేల మందికి డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అలాగే తిరుపతి ఐఐటీని నాలెడ్జ్ పార్టనర్‌గా చేసుకుంటూ మరో ఎంఓయూ కుదుర్చుకుంటున్నామని తెలిపారు. డ్రోన్ సదస్సులో భాగంగా సీకే కన్వెన్షన్ సెంటర్లో డ్రోన్ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. 50 ఎగ్జిబిట్స్‌ని ఇందులో ప్రదర్శిస్తున్నామన్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఈ ప్రదర్శనను ప్రజలందరూ, విద్యార్థులు, ఔత్సాహికులు అందరూ వచ్చి తిలకించవచ్చని తెలిపారు. ఈ సదస్సులో భాగంగా ఔత్సాహికుల కోసం డ్రోన్ హ్యాక్ థాన్ నిర్వహించామని ఇందులో 520 మంది పాల్గొన్నారని చెప్పారు. 9 థీమ్స్ లో పోటీని నాలుగు కేటగిరీలుగా వర్గీకరించామన్నారు.

ముందుగా కేవలం ముగ్గురు విజేతలను మాత్రమే ఎంపిక చేయాలని అనుకున్నప్పటికీ ప్రజల నుంచి వచ్చిన స్పందన చూశాక ఔత్సాహికులకు మరింత ప్రోత్సాహం అందించాలని సీఎం చంద్రబాబు సూచించడంతో నాలుగు కేటగిరీల్లో ఒక్కో కేటగిరీలో ముగ్గురు విజేతలను ఎంపిక చేస్తున్నామని, మొదటి బహుమతి రూ.3 లక్షలు, రెండో బహుమతి రూ.2 లక్షలు, తృతీయ బహుమతి రూ.1లక్ష ఇస్తున్నామని, 22వ తేదీ సాయంత్రం పున్నమీఘాట్‌లో జరిగే సాంస్కృతిక కార్యక్రమంలో సీఎం చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

డీఎస్సీపైనే ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అది నిలిచిపోయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాత డీఎస్సీని రద్దు చేసింది. వాటితోపాటు అదనంగా పోస్టులను కలిపి 16,347 పోస్టులను వెల్లడించింది. ఆరేళ్లుగా డీఎస్సీ ప్రకటన కోసం నాలుగు లక్షలకుపైగా అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. కనీసం 25వేల పోస్టులతోనైనా మెగా డీఎస్సీ ప్రకటించాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

పాత సిలబస్‌తోనే...

త్వరలో రాబోయే డీఎస్సీ-2024ను పాత సిలబస్‌తోనే నిర్వహిస్తారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చింది. గత నోటిఫికేషన్ ప్రకారంగానే సిలబస్ ఉంటుందని, ఎలాంటి మార్పులు లేవని, పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవాలని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్ తరహాగానే డీఎస్సీ సిలబస్ ఉంటుంది. అన్నీ సవ్యంగా సాగితే టెట్ పరీక్షా ఫలితాలు నవంబరు 2గాని, ఆ తర్వాతగాని వెలువడతాయి. ఆ వెనువెంటనే డీఎస్సీ ప్రకటనకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈనెల 23న జరిగే కేబినెట్ సమావేశంలో డీఎస్సీ భర్తీపై ఒక స్పష్టత వస్తుందని నిరుద్యోగులు ఆశిస్తున్నారు. డీఎస్సీకి కేబినెట్ ఆమోదిస్తే... ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. ఇదే సమయంలో ఇటీవల కాలంలో అన్ని జిల్లాల్లోనూ ఉపాధ్యాయులు పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం ప్రకటించిన పోస్టులను పెంచి..నోటిఫికేషన్ జారీజేయాలని, వయోపరిమితిని జనరల్ అభ్యర్థులకు 47 ఏళ్లకు పెంచాలని ప్రభుత్వానికి అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఔషధాల ధరల పెంపు తగదు: మమతా బెనర్జీ

కోల్‌కతా: నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ఇటీవల 8 ఔషధాల ధరలను 50 శాతం పెంచడానికి ఆమోదించింది. ఈ ఎనిమిది ఔషధాల ధరల పెంపుపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఔషధాల ధరల నిర్ణయంపై పునరాలోచించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. పౌరుల సంక్షేమమే ప్రధానమని లేఖలో మమత ఉద్ఘాటించారు. "సామాన్య ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ఎనిమిది అవసరమైన ఔషధాల ధరలను పెంచే నిర్ణయాన్ని పునఃపరిశీలించవలసిందిగా సంబంధిత మంత్రిత్వ శాఖకు ఆదేశాలు జారీ చేయాలని నేను మిమ్మల్ని కోరుతున్నాను. సమతుల్య విధానాన్ని కాపాడటమే మా లక్ష్యం. పౌరుల సంరక్షణ మీ తక్షణ సూచనల కోసం వేచి ఉంది." అని లేఖలో ప్రస్తావించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రకారం.. అక్టోబర్ 8న జరిగిన అథారిటీ సమావేశంలో డ్రగ్స్ (ధరల నియంత్రణ) ఆర్డర్, 2013లోని పారా 19 కింద ఇచ్చిన అసాధారణ అధికారాలను ఉపయోగించి ఈ నిర్ణయం తీసుకున్నారు. సరసమైన మందులను అందించే ఆదేశాన్ని రాజీ పడకుండా ఈ మందుల తయారీలో ఆర్థిక సాధ్యతను కొనసాగించడమే లక్ష్యం అని పేర్కొంది. యాక్టివ్ ఫార్మాస్యూటికల్ పదార్థాల ధర పెరగడం, ఉత్పత్తి ఖర్చులు పెరగడం, మారకపు రేట్ల హెచ్చుతగ్గుల కారణంగా ఔషధ తయారీదారులు ధరలను సవరించారు. ఆస్తమా, గ్లాకోమా, తలసేమియా, క్షయ, మానసిక ఆరోగ్య రుగ్మతల వంటి చికిత్సల్లో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఔషధాల ధరల పెరుగుదల ఆమోదం పొందింది. ఈ మందులు తరచుగా ప్రజారోగ్య కార్యక్రమాలలో మొదటి-లైన్ చికిత్సలుగా ఉపయోగించబడతాయి. ధరల పెంపు వల్ల ప్రభావితమైన మందుల జాబితాలో సాల్బుటమోల్ (ఆస్తమా చికిత్సలో ఉపయోగించే ఔషధం), స్ట్రెప్టోమైసిన్ (యాంటీబయాటిక్, టీబీ), లిథియం (బై పోలార్ డిజార్డర్), పైలోకార్పిన్ కంటి చుక్కలు (గ్లుకోమా), అట్రోపిన్ ఇంజెక్షన్ (యాంటీబయాటిక్), డిఫెరాక్సామైన్ (థలసీమియా), సెఫ్రడ్రోక్సిల్ (యాంటీబయాటిక్) ఉన్నాయి.

ఏపీ పోలీస్ బ్రాండ్ నిలబెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

దేశంలోనే మోడల్ పోలీస్ గా ఉండాలనే ఉద్దేశంతో వివిధ చర్యలు తీసుకున్నామని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో కక్షసాధింపు, రాజకీయ వేధింపుల కోసం పోలీసులను తయారుచేసే పరిస్థితికి వచ్చారని, అలాంటి పనులకు ప్రతిష్ఠాత్మక ఐపీఎస్ వ్యవస్థను ఉపయోగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులంటే రాగద్వేషాలకు అతీతంగా పనిచేసే వ్యవస్థ అన్నారు. ఆనాటి ముఖ్యమంత్రి రక్షణ కోసం రూ. 12 కోట్లతో కంచె వేసుకొన్నారని, ఫింగర్ ప్రింటింగ్ ఐడెంటిఫికేషన్ వంటి వ్యవస్థ నిర్వహణ కోసం మాత్రం అయిదేళ్లలో రూ. 10 కోట్లు ఇవ్వలేకపోయారని విమర్శించారు. మరోవైపు సర్వే రాళ్లపైన తన బొమ్మ కోసం రూ. 700 కోట్లు తగలేసిన వ్యక్తి సీసీటీవీ కెమెరాల కోసం రూ. 700 కోట్లు ఇవ్వలేదన్నారు. ఈ మొత్తం ఇచ్చుంటే ఈరోజు అఘాయిత్యాలు జరిగే పరిస్థితి ఉండేది కాదన్నారు. విశాఖలో రూ. 500 కోట్లతో ప్యాలెస్ కట్టుకున్న వ్యక్తి పోలీసులకు సరెండర్ లీవ్‌లు ఇవ్వకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రభుత్వంపై అనేక సవాళ్లు ఉన్నాయని చెబుతూ... గత ప్రభుత్వం తెచ్చిన రూ. 10,50,000 కోట్ల అప్పుకు వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు.

పోలీసులకు సవాల్‌గా మారిన సైబర్ నేరాలు

గణనీయంగా పెరుగుతున్న సైబర్ నేరాలు పోలీస్ శాఖకు సవాల్‌గా మారాయని చంద్రబాబు అన్నారు. నేరగాళ్ల కంటే మెరుగ్గా మనం టెక్నాలజీని అప్‌డేట్ చేసుకుంటేనే శాంతిభద్రతలను కాపాడగలమన్నారు. కొందరు రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడుతూ పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఆ ముసుగు తీసి శాంతిభద్రతలను కాపాడే విషయంలో పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పోలీస్ సంక్షేమానికి ప్రతి ఏటా 20కోట్లు కేటాయిస్తామని, అలాగే త్వరలో 6,100 కానిస్టేబుల్స్ పోస్టులను భర్తీ చేస్తామని సీఎం ప్రకటించారు. హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ పోలీసుల త్యాగాల వల్లే సమాజం ప్రశాంతంగా ఉంటుందన్నారు.

నవతరానికి ఉత్సాహాన్ని, స్ఫూర్తిని, ప్రేరణను రగిలించడమే పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ నిర్వహణ ముఖ్య ఉద్దేశమన్నారు. రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల రావు మాట్లాడుతూ పోలీస్ సంస్మరణ దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో శాంతి, భద్రతలు కాపాడటమే పోలీసు ప్రథమ కర్తవ్యమని, కుటుంబ సంక్షేమం కంటే సమాజ రక్షణే లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, ఐజీ ఇంటెలిజెన్స్ సీహెచ్. శ్రీకాంత్, పోలీసు ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది, పోలీసు అమరవీరుల కుటుంబాలు, తదితరులు పాల్గొన్నారు.

తూర్పు తీర రాష్ట్రాలకు తుపాను ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

విశాఖ వాతావరణ కేంద్రం ముఖ్య అధికారి కె.వి.ఎస్.శ్రీనివాస్ తెలిపారు. ఇది పశ్చిమ బంగాల్, ఒడిశా తీరం వైపు కదులుతోందన్నారు. ఈ అల్పపీడనం ఈ నెల 24న వాయువ్య బంగాళాఖాతంలో తుపానుగా మారుతుందని, దీని ప్రభావంతో ఉత్తర కోస్తా మీదుగా అనేక ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని చెప్పారు. తుపాను ఏర్పడిన తర్వాత ఈ నెల 24, 25 తేదీల్లో కోస్తాంధ్ర ప్రాంతంలో ప్రభావం చూపుతుందన్నారు. ఒడిశా వైపు సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు వెనక్కి రావాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. మరొక ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలపై సమీక్షలు నిర్వహించారు. మత్స్యకారులు సముద్రంపై వేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. తీర ప్రాంతంలో వాయుగుండం ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాలపై ఉంటుందన్న వాతావరణ శాఖ అధికారుల హెచ్చరికలతో అధికారులు తగిన జాగ్రత్త చర్యలు చేపట్టారు.

బెంగాల్, ఒడిశాకు 25 ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు

బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపాను గురువారం పూరీ-సాగర్ ద్వీపం మధ్య తీరం దాటే అవకాశం ఉన్నందున జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) పశ్చిమ బెంగాల్‌లో 14 బృందాలను, ఒడిశాలో 11 బృందాలను మోహరింపు కోసం సిద్ధంగా ఉంచినట్లు ప్రభుత్వ ప్రకటన సోమవారం తెలిపింది. తుపాను కోసం సంసిద్ధతను సమీక్షించడానికి సోమవారం జరిగిన జాతీయ సంక్షోభ నిర్వహణ కమిటీ (ఎన్‌సీఎంసీ) సమావేశంలో క్యాబినెట్ కార్యదర్శి సోమనాథన్‌కు కూడా ఓడలు, విమానాలతో పాటు సైన్యం, నావికాదళం, కోస్ట్ గార్డ్‌ల అదనపు సహాయ, ఉపశమన బృందాలను సంసిద్ధతలో ఉంచినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాణనష్టం లేకుండా చూడటానికి, ఆస్తి, మౌలిక సదుపాయాల నష్టాన్ని తగ్గించడానికి అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవచ్చని సోమనాథన్ నొక్కి చెప్పారు. సముద్రంలో ఉన్న మత్స్యకారులను వెనక్కి పిలిపించేలా చూడాలని, ప్రమాదకర ప్రాంతాల ప్రజలను సకాలంలో సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన అన్నారు. పొరుగు రాష్ట్రాలైన ఆంధ్ర ప్రదేశ్ జార్ఖండ్, చత్తీస్‌గఢ్‌కు భారీ వర్షాల కారణంగా ఎలాంటి పరిస్థితులు ఎదురైనా వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సోమనాథన్ సూచించారు.

భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా?

(మొదటిపేజీ తరువాయి)

చూడకూడదు, అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే' అని ఖన్నా వ్యాఖ్యానించారు. మరో న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ తన వాదనలు వినిపిస్తూ... ఈ సవరణ అమల్లోకి వచ్చేనాటికి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా స్పందిస్తూ 'మీరు భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా..?' అని సూటిగా ప్రశ్నించారు. దీనిపై అడ్వకేట్ జైన్ బదులిస్తూ 'భారత్ లౌకిక దేశంగా ఉండకూడదని మేము అనడంలేదు. ఆ సవరణను మాత్రమే సవాలు చేశాం' అని పేర్కొన్నారు. పీఠికలో ఈ రెండు పదాలు చేర్చడం వల్ల పాండోరా బాక్స్‌ను తెరిచినట్లు అయిందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ప్రజాస్వామ్యం అనే పదాన్ని కూడా తొలగించవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇక బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి తన వాదనలు వినిపిస్తూ... పీఠికలో 26 నవంబరు, 1949 తేదీ ఉండటం తప్పని నిరూపిస్తానని పేర్కొన్నారు. 'మనకు రాజ్యాంగ పీఠిక రెండు భాగాలుగా ఉండొచ్చు. కానీ, సెక్యులరిజం, సోషలిజం పదాలు చేర్చడానికి భారత ప్రజలు అంగీకరించారని చెప్పడం సరికాదు. పీఠిక రెండు భాగాల్లో ఒక దానిని తేదీతో, మరో దానికి డేట్ లేకుండా ఉంచవచ్చు'అని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ... పిటిషనర్లు సంబంధిత పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని చెప్పారు. నోటీసులు జారీ చేయడానికి మాత్రం బెంచ్ అంగీకరించలేదు. తదుపరి వాదనలను నవంబరు 18న వింటామని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

వక్ఫ్ బిల్లుపై ప్రతిపక్ష ఎంపీల నిరసన

(మొదటిపేజీ తరువాయి)

చేశాయి. అభ్యర్థన వెనుక ప్రతిపక్ష ఎంపీలు కొంతమంది న్యాయవాదుల నుంచి అభిప్రాయాలు తీసుకోవాలనే ప్యానెల్ నిర్ణయాన్ని ప్రతిపక్ష ఎంపీలు ప్రశ్నించడంతో సమావేశం వాడీవేడిగా మారింది. బీజేపీ సభ్యులు తీవ్రంగా స్పందించారు. ఏదైనా ప్రతిపాదిత చట్టంలో భారతీయులందరూ భాగస్వాములని, కమిటీ తన విజ్ఞతతో ఏదైనా విలువైన సూచనను అందించడానికి తగినదని భావించే ఎవరినైనా పిలవవచ్చని బీజేపీ ఎంపీ ఒకరు చెప్పారు. వక్ఫ్ చట్టం పెద్ద సంఖ్యలో ముస్లింయేతరులపై ప్రభావం చూపిందని ఆయన పేర్కొన్నారు. న్యాయవాదులు అశ్విని ఉపాధ్యాయ్, బీజేపీ సభ్యుడు, విష్ణు శంకర్ జైన్ ఈ సుప్రీం పిటిషన్ల వెనుక ఉన్నవారిలో ఉన్నారు. వారు గత వారం బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ నేతృత్వంలోని కమిటీ ఎదుట హాజరయ్యారు. మంత్రిత్వ శాఖ ప్రజెంటేషన్ సందర్భంగా వక్ఫ్ చట్టాన్ని సవరించే నిర్ణయానికి ముందు జరిగిన సంప్రదింపుల మినిట్స్‌లో ప్రస్తుత చట్టాన్ని భర్తీ చేయడానికి కొత్త చట్టం ఆవశ్యకత గురించి ప్రస్తావించలేదని కొందరు ఎంపీలు పేర్కొన్నారు. గత ఏడాది నవంబరులో జరిగిన ఈ సమస్యపై మంత్రిత్వ శాఖ తన చివరి సమావేశంలో చట్టం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను పరిష్కరించడానికి పరిపాలన, సాంకేతిక చర్యలను సూచించిందని ఇద్దరు ప్రతిపక్ష ఎంపీలు పేర్కొన్నారు.

2,684 కోట్లతో 'దీపం'

(మొదటిపేజీ తరువాయి)

సిలిండర్ రిటైల్ మార్కెట్ ధర రూ.876 కాగా కేంద్ర ప్రభుత్వం ప్రతి సిలిండర్‌కు రూ.25ల సబ్సిడీ ఇస్తుండగా ప్రస్తుతం సిలిండర్ ధర రూ.851గా ఉందని వివరించారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వల్ల ప్రభుత్వంపై రూ.2,684 కోట్ల అదనపు భారం పడుతుందని, అదే ఐదేళ్లకు కలిపి రూ.13,423 కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు.

ఈ నెల 28న విజయవాడలో

అగ్రిగోల్డ్ బాధితుల మహావిజ్ఞాపన దీక్ష

ప్రత్యేక కమిటీ వేసి బాధితులకు న్యాయం చేయండి

అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర - విజయవాడ: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అక్టోబరు 28వ తేదిన విజయవాడ ధర్నా చౌక్ వద్ద అగ్రిగోల్డ్ బాధితులు మహా విజ్ఞాపన దీక్ష చేయనున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, ఉప ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక దాసరి భవన్‌లో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ చేసిన మోసానికి, లక్షలమంది కుటుంబాల కష్టాలకు 10 ఏళ్లు నిండాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం బాధితుల నిమిత్తం రూ.906 కోట్లు ఇచ్చి మ.మా. అనిపించినందువల్ల ఘోరంగా ఓడిపోయిందన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో మరణించిన వారి కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా పువ్వుల్లో పెట్టి ఇస్తానని, వారంలో రూ.20వేల లోపు డిపాజిట్‌దారులకు, ఆరు నెలల్లో అందరి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తానని జగన్ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ తర్వాత అగ్రిగోల్డ్ బాధితుల గోడు వినడం కాని, కనీసం అర్జీ తీసుకోవటం కాని గత ప్రభుత్వం చేయలేదన్నారు. ఈ స్థితిలో 10లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులకు సంబంధించిన సమస్యను ఆస్తులు అమ్మి పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో పెట్టిందన్నారు. ఈ సమస్యపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుని కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉందనే కారణంగా వెనువెంటనే డబ్బులు ఇవ్వాలని కోరలేదన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తుల పరిరక్షణకి, కోర్టులో ఉన్న కేసు పరిష్కారానికి, ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఉన్న బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమర్థవంతమైన అధికారులతో వెంటనే ప్రత్యేక కమిటీ (స్పెషల్ పర్పస్ వెహికల్)ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అధికారుల బృందం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటిస్తే బాధితులు వారి ఇబ్బందులను కమిటీ దృష్టికి తీసుకువస్తారని తెలిపారు. కంపెనీ అడ్డగోలుగా ఆస్తులు అమ్మేస్తోందని, మట్టి, కలపతో పాటు బినామీ ఆస్తులను కూడా అమ్ముకుంటున్నదన్నారు. అటాచ్‌మెంట్ చేసిన ఆస్తుల్ని కోర్టులో అబ్‌సొల్యూట్ చేయించి ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకోవాలని, వేల ఎకరాలు ఉన్న రియల్ ఎస్టేట్ భూములను చిన్న చిన్న కమతాలుగా విభజించాలని, ఇంటి స్థలాలకు పనికివచ్చే భూములను ప్లాట్లుగా వేసి వేలం వేయటం ద్వారా బాధితులకు ఇచ్చే దాని కంటే రెట్టింపు డబ్బులు ప్రభుత్వానికి మిగులుతాయని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. అగ్రిపరివార్ పేరుతో సేకరించిన మరో రూ.500 కోట్లు కూడా ఇప్పించాలన్నారు. ఏలూరు కోర్టులో ఉన్న కేసును త్వరితగతిన క్లియర్ చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 28వతేదీ విజయవాడలో జరిగే అగ్రిగోల్డ్ బాధితుల మహా విజ్ఞాపన దీక్షకు అన్ని జిల్లాల నుంచి బాధితులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు షరీఫ్, కార్యదర్శి వీరభద్రం, రాష్ట్ర నాయకులు విజయకుమార్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వ నిర్లక్ష్యం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గత వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే... నేడు కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ధ్వజమెత్తారు. వైసీపీ చేసింది మహా పాపమైతే... కూటమి సర్కారు విద్యార్థులకు పెడుతున్నది శాపమని సోమవారం ఎక్స్‌వేదికగా ఆమె ట్వీట్ చేశారు. వైఎస్ఆర్ మానస పుత్రిక ఫీజు రీయింబర్సెమెంట్ పథకమని, మహానేత హయాంలో, కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన ఒక ప్రతిష్ఠాత్మక పథకమని పేర్కొన్నారు. పేద బిడ్డల జీవితాల్లో వెలుగులు నింపి, ఎంతో మంది ఇంజినీర్లను, డాక్టర్లను తయారు చేశారని గుర్తుచేశారు. నాడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని వైఎస్ఆర్ అద్భుతంగా అమలు చేస్తే, సొంత కొడుకై ఉండి జగన్ మోహన్ రెడ్డి తన హయాంలో పథకాన్ని నీరు గార్చారన్నారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు రూ.3,500 కోట్లు పెండింగ్ పెట్టడం సిగ్గుచేటన్నారు. బకాయిలు చెల్లించకుండా వారి జీవితాలతో చెలగాట మాడారని అన్నారు. దోచుకొని దాచుకోవడంపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల సంక్షేమంపై పెట్టలేదన్నారు. వైఎస్ఆర్ తన జీవితం మొత్తం బీజేపీనీ వ్యతిరేకిస్తే... అదే బీజేపీకి జగన్ దత్తపుత్రుడుగా మారారని విమర్శించారు. బకాయిలు ఎవరు పెండింగ్ పెట్టినప్పటికీ వాటిని విడుదల చేయాల్సిన బాధ్యత సీఎం చంద్రబాబు ప్రభుత్వంపైనే ఉందన్నారు.

ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో 2024-25 ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజు చెల్లింపు సోమవారం నుంచి ప్రారంభమైంది. ఫీజు చెల్లింపునకు నవంబరు 11 వరకు బోర్డు అవకాశం కల్పించింది. రూ.100 అపరాధ రుసుంతో నవంబరు 12 నుంచి 20 వరకు ఫీజు చెల్లించవచ్చు. మొదటి/రెండో ఏడాది చదివే విద్యార్థులు జనరల్ థియరీ సబ్జెక్టులకు రూ.600, సెకండ్ ఇయర్ ప్రాక్టికల్ పరీక్షలకు రూ.275, బ్రిడ్జి కోర్సు సబ్జెక్టులకు రూ.165 చొప్పున ఫీజు నిర్ధారించారు. మొదటి, రెండో ఏడాదికి కలిపి థియరీ పరీక్షలకు రూ.1,200 చెల్లించాలి. హాజరు మినహాయింపుతో ప్రైవేటు అభ్యర్థులకు ఈనెల 15లోగా రూ.1,500 ఫీజు చెల్లింపునకు అవకాశం కల్పించారు.

ఫీల్డ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత: సీపీఎం డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీఆర్ వైద్యసేవ విభాగంలో 18 ఏళ్లుగా పనిచేస్తున్న ఫీల్డ్ సిబ్బందికి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీఎం చంద్రబాబుకు ఆయన ఒక లేఖ రాశారు. ఎన్టీఆర్ వైద్యసేవ ఫీల్డ్ సిబ్బంది (వైద్య మిత్ర, టీం లీడర్, ఆఫీస్ అసోసియేట్ జిల్లా మేనేజర్లు) ఉద్యోగులుగా 2007 నుంచి పనిచేస్తున్నారని తెలిపారు. వారికి ఏకైక జీవనోపాధి ఈ చిరుద్యోగం మాత్రమేనని, నెలసరి జీత భత్యం రూ.13,087తో యావత్ కుటుంబం ఆధారపడి జీవిస్తున్నారని, అందరూ డిగ్రీ, పీజీ, బీఎస్సీ నర్సింగ్, ఎమ్మెస్సీ నర్సింగ్, బి.ఫార్మసీ, డీ ఫార్మా కోర్సులు అభ్యసించి ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ... వారికి ఉద్యోగ భద్రత లేదన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టును... ఆ ట్రస్టు పరిధి నుంచి మినహాయించి హెల్త్ బీమా అమలు పథకం మార్పు కోసం ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. దీంతో తాము ఉద్యోగాలు కోల్పోతామన్న ఆందోళనలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారని పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి వారికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

20 లక్షల ఉద్యోగాలే లక్ష్యం

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ : దిల్లీలో ఐసీఈఏ ప్రతినిధులతో భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే ఐదేళ్లల్లో 20లక్షల ఉద్యోగాలు సాధించడంలో ఐటీ, ఎలక్ట్రానిక్ రంగాలు కీలకపాత్ర పోషిస్తాయని ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలతోనే కాకుండా ఇతర దేశాలతోను తాము పోటీపడుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఇండియన్ సెల్యులర్, ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రతినిధులతో మంత్రి లోకేశ్ సోమవారం న్యూ దిల్లీలో సమావేశమయ్యారు. దీనికి ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మహీంద్ర అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్‌ను ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి చేపడుతున్న చర్యలు, రాష్ట్రంలో నెలకొన్న అనుకూలతలపై పరిశ్రమదారులకు మంత్రి లోకేశ్ విశదీకరించారు. రాష్ట్రంలో ఇప్పుడు దేశంలోనే అత్యంత సులభతరమైన ఇండస్ట్రీ ఫ్రెండ్లీ పాలసీలను అమలు చేస్తున్నామని, అన్నిరకాల పరిశ్రమలకు అనువైన ఎకో సిస్టమ్ ఏర్పాటుచేస్తున్నామని చెప్పారు. నాలుగోసారి సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న చంద్రబాబుకు దూరదృష్టి గల నాయకత్వంలో అభివృద్ధి దిశగా రాష్ట్రం ముందుకు సాగుతోందన్నారు. తిరుపతిని ఎలక్ట్రానిక్స్ హబ్‌గా మార్చడానికి పరిశ్రమదారులు సహకారాన్ని కోరుతున్నామని చెప్పారు. ఇప్పటికే ప్రపంచంలోనే పేరెన్నికగన్న డిక్సన్, డైకిన్, టీసీఎల్ కంపెనీలు తమ యూనిట్లను ఏర్పాటు చేశాయని వివరించారు. అనంతపురంలో కియా మోటార్స్ ఇప్పటికే పనిచేస్తోందన్నారు. అనంతపురం, కర్నూలు జిల్లాలను ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ, ఈవీ కీలక కేంద్రాలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. అన్నివిధాలా అనువైన వాతావరణంతో వ్యూహాత్మక పెట్టుబడి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని, రాష్ట్రాభివృద్ధికి మీ వంతు సహాయ, సహకారాలు అందించాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

సీజే బెంచ్‌కు సజ్జల కేసు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తనపై ఉన్న లుక్‌అవుట్ నోటీసు రద్దు చేయాలని కోరుతూ వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో సజ్జలపై మంగళగిరి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇటీవల సజ్జలపై గుంటూరు ఎస్పీ లుక్‌అవుట్ నోటీసు జారీ చేశారు. దీనిపై హైకోర్టులో సజ్జల క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ సీజే బెంచ్‌కు బదిలీ చేయాలని న్యాయమూర్తి రిజిస్ట్రీని ఆదేశించారు.

నందిగం సురేశ్‌కు మరో 14 రోజుల రిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వెలగపూడి లోని మహిళ మరియమ్మ హత్య కేసులో మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు మరో 14 రోజులపాటు రిమాండ్ విధించారు. ఇటీవల ఈ కేసు విచారణలో భాగంగా సురేశ్‌ను రెండు రోజులపాటు కస్టడీకి తీసుకున్నారు. కస్టడీ పూర్తయిన అనంతరం ఆయనను మంగళగిరి కోర్టులో పోలీసులు ప్రవేశపెట్టగా... నవంబరు నాలుగో తేదీ వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారు. దీంతో గుంటూరు జైలుకు సురేశ్‌ను తరలించారు.

రుషికొండ ప్యాలెస్ సందర్శించిన డిప్యూటీ సీఎం పవన్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: వైసీపీ ప్రభుత్వంలో సుమారు రూ.500 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన రుషికొండ ప్యాలెస్ భవనాన్ని ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కల్యాణ్ తొలిసారి విశాఖపట్నంలో పర్యటనలో భాగంగా సోమవారం సాయంత్రం సందర్శించారు. గతంలో జనసేన అధినేతగా అనేక సార్లు రుషికొండ భవనాల పరిశీలనకు పవన్ కల్యాణ్ వెళితే వైసీపీ ప్రభుత్వం అడ్డుకుంది. పచ్చని కొండను తొలిచి, పర్యావరణాన్ని పాడుచేసి, మంచి భవనాలను కూల్చి వైస్ జగన్ రుషికొండ ప్యాలెస్‌ను నిర్మించారని పవన్ పెద్ద ఎత్తున అప్పట్లో ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా బాధితులను పరామర్శకు వచ్చిన ఆయన విశాఖలో రుషికొండ భవనాలను ఎంపీ శ్రీభరత్‌తో పాటు జనసేన ఎమ్మెల్యేలతో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న సిబ్బందితో, పని వారితో ఫొటోలు దిగారు. రుషికొండ ప్యాలెస్ నుంచి సెల్ఫీ తీసుకున్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం రుషికొండ భవనాల వినియోగంపై నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రుషికొండ భవనాల విషయంలో న్యాయపోరాటం చేయడంపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌ను ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రశంసించారు. బయట ఉద్యానవన పనులు చేస్తున్న మహిళా కూలీలతో కాసేపు పవన్ ముచ్చటించారు. జనసేన నాయకులు పీతలమూర్తి యాదవ్ స్పందిస్తూ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అందిస్తున్న సహకారంతోనే న్యాయ పోరాటం సాధ్యమైందని ధన్యవాదాలు చెప్పారు.

దేశంలో ఆర్థిక అక్షరాస్యత పెరగాలి

మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజల్లో అవగాహన

ఎంఎఫ్ఏఐ సీఈవో చలసాని వెంకట్

విశాలాంధ్ర- విశాఖపట్నం: దేశంలో ఆర్థిక అక్షరాస్యత బాగా పెరగాల్సి ఉందని మ్యూచువల్ ఫండ్ అసోసియేషన్-ఇండియా (ఎంఎఫ్ఏఐ) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) చలసాని వెంకట నాగేశ్వర్ అన్నారు. సెబీ అధ్వర్యంలో మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న అవగాహన సదస్సుల్లో భాగంగా సోమవారం విశాఖ విచ్చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ మ్యూచువల్ ఫండ్స్ దేశంలో ప్రవేశించి 60 ఏళ్లు అయినప్పటికీ మిగతా దేశాలతో పోలిస్తే ఆశించిన రీతిలో పెట్టుబడులు పెరగలేదన్నారు. సెబీ సూచనల మేరకు ఏపీ సహా మూడు రాష్ట్రాల్లో విద్యాసంస్థలు... వివిధ వర్గాల ప్రజలను కలిసి మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థలో మ్యూచువల్ ఫండ్స్ 67.9 లక్షల కోట్లు కలిగి ఉందని, 44 ఎసెట్ మేనేజ్‌మెంట్ సెంటర్ల ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక సేవలు అందిస్తుందని తెలిపారు. దశాబ్ద కాలంలో మూడవ అతిపెద్ద ఇండస్ట్రీగా ఎదిగిందని చెప్పారు. దేశంలో ఇప్పటివరకు మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఐదు కోట్ల మంది స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టారని వివరించారు. 15 వేల కోట్లు ఫిక్స్‌డ్ ఇన్‌కం స్కీమ్స్‌లో పెట్టుబడులు పెట్టగా 65 వేల కోట్లు గ్రోత్ ఈక్విటీ స్కీమ్స్‌లో, ఏడువేల కోట్లు బ్యాలెన్స్ స్కీమ్స్‌లో పెట్టుబడి పెట్టడం జరిగిందని అన్నారు. ప్రజలు ఆర్థికంగా ఉన్నతిస్థితికి చేరాలన్నా, దేశ ఆర్థిక బలోపేతానికి మ్యూచువల్ ఫండ్స్ లో పెట్టుబడులు ఎంతో ఉపయుక్తమని చెప్పారు.

రుషికొండలో రాష్ట్ర మ్యూజియం

పర్యాటక భవనాలు ప్రజలకు అంకితం

సీఎంకు ఆచార్య కేఎస్ చలం లేఖ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: అమరావతిలో దక్షిణాది రాష్ట్రాల జనాభాపై మాట్లాడుతూ ఆంధ్రులు... జనాభా సంఖ్యను పెంచుకోవాలని సీఎం చెప్పటం ఒక దార్శనికునికి ఉన్న ముందు చూపును తెలియజేస్తుందని యూపీఎస్సీ మాజీ సభ్యుడు ఆచార్య కేఎస్ చలం అన్నారు. ఈమేరకు ఆయన సీఎం చంద్రబాబునాయుడుకి సోమవారం లేఖ రాశారు. ఒక ఆర్థికశాస్త్ర ఆచార్యునిగా, పరిశోధకునిగా ఈ విషయాన్ని తాను ఎప్పుడో రాశానన్నారు. కేంద్రం... ఫైనాన్స్ కమిషన్ కేటాయింపుల్లో మనం జనాభా ప్రాతిపదికన నష్ట పోతాం అని మీరు గ్రహించి చర్యలు తీసుకోవటం ఆనందం కలుగజేసిందని పేర్కొన్నారు. మన తెలుగు జాతి చరిత్ర సంస్కృతిపై కూడా దృష్టి పెట్టాలని కోరారు. తెలుగు జాతి చరిత్రలో విశాఖపట్నంకు ముఖ్యంగా నాటి త్రికలింగలో భాగమైన మద్రాసు రాష్ట్రంలోని విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలు (గంజాం) తెలుగువారికి గొప్ప ఆభరణాలు అని, ఈ ప్రాంత చరిత్రలో క్రీస్తుపూర్వం బౌద్ధ, జైన మతాలు అమరావతి కంటే ముందునుంచి ఉన్నాయన్నారు. విశాఖలోని బావికొండ, తొట్ల కొండ, పావురాళ్ళకొండతోపాటు పవిత్రమయిన రుషి కొండఉందని, దీన్ని ఉత్తరాంధ్ర ప్రజలు ముఖ్యంగా విశాఖవాసులు చాలా భక్తి గౌరవాలతో చూస్తారన్నారు. దానిని మీరు గౌరవిస్తారని ఆశిస్తున్నామన్నారు. టూరిజమ్ భవనాలను ప్రజలకు అంకితం చేసి తెలుగు జాతి గొప్పతనాన్ని ఇనుమడించేలా రాష్ట్ర మ్యూజియం గా వినియోగించాలని కోరారు. రాష్ట్రం విడిపోయిన తరువాత మనకు రావలసిన శిల్ప, కళా ఖండాలు, విశాఖలో దొరికిన బుద్ధుని అవశేషాలు (ఇప్పటికీ హైదరాబాద్ లో ఉన్నవి) ఇక్కడకు తీసుకు రావలసి ఉందన్నారు. అంతర్జాతీయంగా జపాన్, వియెట్నాం, చైనా థాయిలాండ్, శ్రీలంక వంటి దేశాలకు దర్శనీయ స్థలం అవుతుందన్నారు. ఈస్ట్ కోస్ట్ లేక తూర్పు తీర మ్యూజియం గా కూడా ప్రకటించి కేంద్ర ప్రభుత్వం దీనికి నిధులు కేటాయించేలా ప్రయత్నిస్తే ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. తెలుగు ప్రజలే గతంలో తూర్పు తీరం అంతా ఉండేవారని, ఇప్పుడు కూడా పూరీ నుంచి రామేశ్వరం వరకు మత్స్యకారులు తెలుగు మాట్లాడతారని, ఆ విధంగా తెలుగుదేశం తెలుగు జాతికి ఒక మ్యూజియం ఏర్పాటు చేసినట్లు అవుతుందని లేఖలో పేర్కొన్నారు. అంతర్జాతీయ సెమినార్లు, పరిశోధకులకు కావలసిన సౌకర్యాలు కల్పించి దానిని ఉన్నత స్థాయి సంస్థగా రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు గుంటూరు, వైఎస్ఆర్ జిల్లాలో జగన్ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23వ తేదీ బుధవారం గుంటూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో పర్యటించనున్నారని పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం వెల్లడించింది. అఘాయిత్యాలకు గురైన ఆడపిల్లల కుటుంబాలను పరామర్శించనున్నారు. టీడీపీ కార్యకర్త, రౌడీ షీటర్ దుర్మార్గం కారణంగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన తెనాలికి చెందిన యువతిని జగన్ పరామర్శించనున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న యువతిని, ఆమె కుటుంబాన్ని కలుసుకుంటారు. ఆ తర్వాత బద్వేలులో సజీవదహనానికి గురైన బాలిక కుటుంబాన్ని అదే రోజు మధ్యాహ్నం జగన్ పరామర్శిస్తారు. అనంతరం ఆయన నేరుగా పులివెందులకు వెళ్తారు.

అత్యాచారాలకు జగన్ గంజాయే కారణం: వర్ల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆడబిడ్డలపై అత్యాచారాలు, దాడుల సంఘటనలకు గత జగన్ ప్రభుత్వ హయాంలో గంజాయే కారణమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య విమర్శించారు. మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఆడబిడ్డలకు రక్షణతోపాటు శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఆడబిడ్డల రక్షణ... శాంతిభద్రతలపై మాట్లాడే నైతిక అర్హత జగన్‌కు ఉందా అని ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనలో మహిళలపై రెండు లక్షల నేరాలు జరిగితే నోరు మెదపకుండా ఇప్పుడు చంద్రబాబును వేలెత్తి చూపుతున్నారని మండిపడ్డారు. డ్రగ్స్, గంజాయితో యువత భవితను జగన్ నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం మహిళా రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనకాపల్లి జిల్లాలో బాలిక హత్య ఘటనలో నిందితుణ్ని పట్టుకోవడానికి 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిందన్నారు. ఏ రోజైనా మహిళలు భద్రతపై డీజీపీతో జగన్ మాట్లాడారా అని నిలదీశారు.

విద్యారంగ సమస్యలపై ఉద్యమం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: విద్య ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ, కాషాయకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థిలోకం ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ కృష్ణా జిల్లా 34వ మహాసభ సోమవారం మచిలీపట్నంలోని ఆంధ్ర సైంటిఫిక్ కంపెనీ ఎంప్లాయిస్ యూనియన్ హాల్ లో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం. సాయికుమార్ అధ్యక్షతన జరిగింది. ఏఐఎస్ఎఫ్ నేత జాస్మిన్ పతాక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ విజయనగరం వేదికగా నవంబరు 27 నుండి 30 వరకు జరిగే ఏఐఎస్ఎఫ్ 49వ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎప్పటికపుడు వ్యతిరేకిస్తూ... విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాడాలని పేర్కొన్నారు. జాతీయ నూతన విద్యా విదానం వల్ల రాష్ట్రంలో చాలా విద్యాసంస్థలు మూతపడ్డాయని... తక్షణమే జాతీయ నూతన విద్యా విధానం రద్దు చేయాలన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకంను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైద్యవిద్యను ప్రైవేటీకరించే జీఓ నెంబరు 107,108 రద్దు చేస్తామని ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో బోధన, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పెరిగిన ధరలకు లనుగుణంగా మెస్ చార్జీలను రూ.2,500లకు పెంచాలని, కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న హాస్టల్ భవనాలను గుర్తించి... వెంటనే కొత్త భవనాలు నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఓఎల్ రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

మహాసభలో ఏఐఎస్ఎఫ్ కృష్ణాజిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కృష్ణాజిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా నాని, సాదిక్ బాబు, ఉపాధ్యక్షులుగా జాస్మిన్, లక్ష్మీ, ప్రత్యూష, లక్ష్మీప్రియ, సహాయ కార్యదర్శులుగా ఝాన్సీ, మౌనిక, సన్నీ, రెహమాన్, కోశాధికారిగా అనితను ఎన్నుకున్నారు.

విద్యా నాణ్యతే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ లక్ష్యం

సమగ్ర శిక్ష సంచాలకులు శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యా నాణ్యతే ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) శిక్షణ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న గ్రేడ్-1, 2 ఉపాధ్యాయులకు ఇదెంతో దోహదపడుతుందని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు వి.శ్రీనివాసరావు చెప్పారు. పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా అధ్వర్యంలో ఆరు రోజుల పాటు జరిగే ఎఫ్ఎల్ఎన్ శిక్షణను ఆయన ఆంధ్రా లయోలా కళాశాల ప్రాంగణం ఎస్‌జే కన్వెన్షన్ సెంటర్ నుంచి సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యతను పెంచడమే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ప్రధాన లక్ష్యమని, ఇది క్షేత్రస్థాయిలో అమలవుతుందన్నారు. ఈ శిక్షణ 1, 2 తరగతులపై దృష్టి సారించడానికేనని, 3 నుంచి 8 సంవత్సరాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయమని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యా వ్యవస్థను పునరుద్ధరించడానికి, ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలను సాధించడానికి అవసరమైన వాతావరణాన్ని సృష్టించి సత్ఫలితాలను అందించడానికి అవకాశం లభిస్తుందన్నారు. గ్రేడ్-1, గ్రేడ్-2 కేటగిరీలో ఉన్న 34 వేల మంది ఉపాధ్యాయులు 14 విడతలుగా పాల్గొంటారని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.03/2024-25, నిట్ నెం.09 నుండి 13 వరకు తేది : 18-10-2024
తెనాలి పరిధిలోని తెనాలి నియోజకవర్గంలో సిమెంట్ రోడ్లు, శ్మశాన వాటికయందు ప్రహరీగోడ, షెడ్డు నిర్మాణము, తారురోడ్డు నిర్మాణము చేయు 5 పనులకు అంచనా విలువ : రూ.73.50 లక్షలతో MPLADS (LS) & (RS) గ్రాంటు క్రింద మంజూరు చేయబడినవి. టెండర్లు 25-10-2024 నుండి ఇ-ప్లాట్ ఫారం ద్వారా కోరబడుచున్నవి. ఇతర వివరాలకు https://www.apeprocurement.gov.in లో చూడగలరు. సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, పంచాయతీరాజ్ డివిజన్, తెనాలి
DIPR/14308/CL/ADVT-1/1/2021-22 Dt. 21-10-2024

సంపాదకీయం

దైవాధీన తీర్పులు

ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్ సరిగ్గా 18 రోజులలో పదవీ విరమణ చేయనున్నారు. దేశ చరిత్రలోనే అత్యంత కీలకమైన సమయంలో ఆయన ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. ప్రజాస్వామ్య విలువలను, మానవతా విలువలను కాల రాస్తున్న సమయంలో, ఎన్నికల కమిషన్ ను ఎడాపెడా దుర్వినియోగం చేస్తున్న దశలో చంద్రచూడ్ 50వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ దశలో కేంద్ర ప్రభుత్వం ఉత్ప్రేరకాల ఆధారంగా నడుస్తుండేది. రెండేళ్లపాటు ప్రధాన న్యాయమూర్తిగా ఉండే అరుదైన అవకాశం ఆయనకు వచ్చింది. న్యాయమూర్తులు సాధారణంగా తమ వీడ్కోలు సమావేశాల్లో నీతులు వల్లిస్తుంటారు. తాము న్యాయమూర్తులుగా ఉన్నప్పుడు ఈ నీతులకు అనుగుణంగా పని చేశామో లేదోనని ఆత్మ పరిశీలన చేసుకోరు. క్రియాశీలంగా ఉన్నారనుకునే న్యాయమూర్తులు విచారణ సందర్భంగాచేసే వ్యాఖ్యలు, ప్రాస్తావిక అంశాలు(ఆబిటర్ డిక్టా) చాలా విప్లవాత్మకమైనవిగా కనిపిస్తాయి. చివరకువారు వెలువరించే తీర్పుల్లో ఆ ఊసే ఉండదు. అది వేరే విషయం. ప్రధాన న్యాయమూర్తి వారాంతాల్లో ఏవో కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు చాలా విలువైన మాటలు చెప్పే వారు. సూత్రీకరణలు చేసేవారు. ఆయన మాటలు వింటే మన న్యాయవ్యవస్థ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించగలుగుతుందన్న విశ్వాసం కలిగించేవారు. ఆయన మాటలు చూస్తే చాలా ఉదారవాదిగా కనిపించే వారు. ప్రజాస్వామ్యం, న్యాయమార్గ పాలన, రాజ్యాంగం మీద నమ్మకం ఉన్నవారు ఆయన వ్యాఖ్యలు, ప్రసంగాలు విని తెగ మురిసిపోయే వారు. కానీ పదవీ విరమణ తేదీ దగ్గర పడుతున్నకొద్దీ ప్రధానమంత్రి చంద్రచూడ్ మాటలు ఆశ్చర్యం కలిగిస్తున్నాయి. తన పదవీ కాలాన్ని చరిత్ర ఏ రకంగా గుర్తు పెట్టుకుంటుందో అన్న చింత ఆయనకు ఎక్కువైనట్టుంది. చరిత్ర ఎవరినైనా గుర్తుపెట్టుకోవడానికి నిజాయితీ అన్న గీటురాయి ఆధారంగానే నిర్ణయిస్తుంది. గత రెండేళ్ల కాలంలో ఆయన చేసిన అనేక వ్యాఖ్యలుచూస్తే ఆయనను చరిత్ర మహనీయుడైన న్యాయమూర్తిగా గుర్తు పెట్టుకుంటుంది అనిపిస్తుంది. కానీ క్రమంగా ఆయన నడవడిక చరిత్ర పుటల్లో ఆయనపేరు సువర్ణాక్షరాల్లో లిఖించే అవకాశం కనిపించడం లేదు. తన నిజాయితీ మీద ఆయనకు సంపూర్ణమైన విశ్వాసమే ఉంటే అసలు ఆయన ఈ విషయం గురించి ఆలోచించవలసిన, వ్యథ చెందాల్సిన అవసరమే ఉండేది కాదు. ఎక్కడో లోపం ఉందని ఆయనకే అనిపిస్తున్నట్టుంది. వ్యక్తి స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ, బహుళ మతాల అస్తిత్వం, రాజ్యాంగ రక్షణలు, న్యాయస్థానాల బాధ్యత, పరిపాలనా విభాగం బాధ్యతాయుతంగా వ్యవహరించవలసిన ఆవశ్యకత గురించి ఆయన చెప్పిన మాటలు బోలెడు ఆశలు రేకెత్తించాయి. కానీ తీర్పులు వెలువరించే దశకు వచ్చినప్పుడు ఆయన కావలసిన మానసిక స్థైర్యాన్ని ప్రదర్శించలేని స్థితిలో పడిపోయిన సంఘటనలు అనేకం కనిపిస్తాయి. ఆయన మాటలున్నంత ఘాటుగా తీర్పులు ఎన్నడూలేవు. ఈ వైఖరి చరిత్రలో ఆయన స్థానాన్ని సుస్థిరం చేయడానికి ఉపకరించదు. ప్రధాన న్యాయమూర్తిగా చంద్రచూడ్ నడవడికను ఆయన వెలువరించిన తీర్పులే నిర్ధారిస్తాయి. తోటి న్యాయమూర్తులకు కేసులు కేటాయించే బాధ్యతలో ఆయన ఇదివరకటి న్యాయమూర్తులకు భిన్నంగా వ్యవహరించిన దాఖలాలులేవు.

కొద్ది రోజుల కింద ఆయన మరో విచిత్రమైన మాట చెప్పారు. కీలకం లేదా జటిలమైన అంశాలలో తీర్పులు వెలువరించేటప్పుడు భగవంతుడు తనకు దారి చూపుతాడన్నారు. ఇది నిర్ఘాంతపోవాలసిన మాటే. న్యాయస్థానం తీర్పులు ప్రజాస్వామ్య వ్యవస్థలో దైవాధీనంగా ఉండకూడదు. కానీ జటిలమైన తీర్పు చెప్పాలన్నప్పుడు దేవుడిని ప్రార్థిస్తే దారి దొరికేది అని ఆయన అంటున్నారు. ఈ దేశంలో తీర్పులు ఇవ్వవలసింది రాజ్యాంగం ఆధారంగా, చట్టబద్ధంగా ఉండాలి తప్ప దేవుడి ఆనతిమీద ఆధారపడి ఉండకూడదు. చంద్రచూడ్ సైన్స్ చదువుకున్నారు. శాస్త్రీయ స్ఫూర్తి పెంపొందించాలని రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో స్పష్టంగా చెప్పుకున్నాం. అలాంటప్పుడు దేవుడి ప్రస్తావన ఎందుకు వస్తుంది. దైవానుజ్ఞ ప్రకారం తీర్పులు చెప్పడం, అంతరాత్మ ప్రభోధం ప్రకారం, అంత: ప్రేరణ ప్రకారం తీర్పులు చెప్పేటట్టయితే రాజ్యాంగ పరిరక్షణకు అవకాశం ఎక్కడ ఉంటుంది. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఆ రాజ్యాంగం మీద ప్రతిజ్ఞ చేసే ఆ పదవిలోకి వచ్చారుగా! న్యాయమూర్తులకు వ్యక్తిగతంగా మత విశ్వాసాలు ఉండవచ్చు. పూజాదికాలు చేయవచ్చు. అది తమ వ్యక్తిగత వ్యవహారం. తమ ఇంటికి పరిమితం కావలసిన అంశం. వినాయక చవితి సందర్భంగా ప్రధానమంత్రిని తన ఇంట్లో పూజకు ఆహ్వానించి ప్రధాన న్యాయమూర్తి ఈ నియమాన్ని బాహాటంగానే ఉల్లంఘించారు. దేవుడి మీద విశ్వాసం ఉంటే ఏం తీర్పు చెప్పాలో అదే తడుతుంది అని ప్రధాన న్యాయమూర్తి చెప్పడం ఆశ్చర్యకరమే కాదు. అభ్యంతరకరం కూడా. దేవుడి ప్రేరణతో తీర్పులు ఇచ్చేటట్టయితే ముక్కోటి దేవతల్లో ఏ దేవుడు, ఏ మతానికి చెందిన దేవుడు అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రధాన న్యాయమూర్తికి ప్రమేయమే ఉండకూడదంటే చంద్రచూడ్ నోరుమెదపలేదు. ఉత్తర ప్రదేశ్‌లో బుల్డోజర్ రాజ్యం కొనసాగుతున్నా, పెగాసస్‌ను వినియోగించి ప్రజలపై నిఘా పెడుతున్నా, సహకరించేదిలేదు అని మోదీ ప్రభుత్వం మొరాయించినా జమ్మూ-కశ్మీర్ రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరణ, ఓటింగ్ యంత్రాలకు అనుబంధంగా ఉండే వి.వి.పాట్ ల చీటీలను ముద్రించాలన్నా, ఎన్నికల కమిషన్ అడ్డగోలు నిర్ణయాలు తీసుకుంటున్నా, పోలైన ఓట్లలో విపరీతమైన తేడాలు కనిపించినా, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రధానే బాహాటంగా ఉల్లంఘించినా ప్రధాన న్యాయమూర్తి అడ్డుకట్ట వేయడానికి ఏ ప్రయత్నమూ చేయలేదు. అంటే ప్రభుత్వ అనుకూల వైఖరి అనుసరించారనే భావించవలసి వస్తుంది. అయోధ్య సమస్య నిజానికి కేవలం స్థలవివాదం. కానీ ప్రజల మతవిశ్వాసానికి ముడిపెట్టి అసలు ఆ స్థల యజమానులకు అక్కడ సూది మొనంత స్థలం కూడా కేటాయించకుండా దాన్ని హిందువులకు అప్పగించినప్పుడూ చంద్రచూడ్ భగవంతుని అనుజ్ఞతోనే తీర్పు రాశారని అనుకోవలసి వస్తుంది. ఈ తీర్పు అంతకుముందు అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు మిగిల్చిన అన్యాయాన్ని సంపూర్ణం చేసింది. ఆ తీర్పు చెప్పిన బెంచీలో అప్పటి ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్, ఎస్.ఎ.బోబ్డే, అశోక్ భూషణ్ తో పాటు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి కూడా ఉన్నారు. తీర్పు ఈ అయిదుగురిలో ఎవరు రాశారో మాత్రం గోప్యంగా ఉంచారు. బయటకొచ్చిన సమాచారం ఆ తీర్పు రాసింది ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తే అంటారు. అయోధ్య తీర్పు రాజ్యాంగ బద్ధమూ, చట్టబద్ధమూ, సహేతుకమూ అని చెప్పే వీలైతే లేదు. అప్పటి ప్రధాన న్యాయమూర్తి గొగోయ్ ని మోదీ ప్రభుత్వం రాజ్యసభ సభ్యుడిని చేసేసింది. బెయిలు హక్కు అని ప్రధాన న్యాయమూర్తి ఎన్నిసార్లు చెప్పారో లెక్కేలేదు. భీమా కోరేగావ్, ఉమర్ ఖాలిద్ లాంటి వారికి అది ఎందుకు వర్తించదో అంతుపట్టదు. దీన్ని వ్యవస్థీకృతం చేయకుండా ఎవరు అడ్డుకున్నారు. పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులకు ఏవో పదవులు ఇవ్వడం ఆనవాయితీ అయిపోయింది. ప్రధాన న్యాయమూర్తికి ఛోటా మోటా పదవులపై కాకుండా అంతకన్నా పెద్ద పదవి మీదే ఉందేమో! సద్గురు జగ్గీ వాసుదేవ్‌ను వెనుకేసుకు వచ్చిన వ్యక్తి నుంచి ఇంతకన్నా ఏమి ఆశించగలం!

మార్జాల శిరోముండనం

చింతపట్ల సుదర్శన్

రంగస్థలం

తను రోజూ వచ్చే మాంసం కొట్టు ముందుకు వచ్చి నిలబడ్డది డాగీ. ఆ కొట్టు పక్కన మరేదో షాపు తెరిచినట్టున్నారు. జనం గుంపులుగా నిలబడి ఉన్నారు. షాపులో అద్దాల వెనుక బొమ్మల కొలువులో బొమ్మల్లా వరుసగా నిలబడి ఉన్నాయి రకరకాల సీసాలు, రంగురంగుల బాటిళ్లు. అర్థమైంది డాగీకి. కొత్త మందు షాపన్న మాట. ఇకనించి ఈ రోడ్డంట హడావిడిగానే ఉంటుంది. సీసాను ఇంటిదాకా మోసుకుపోయే ఓపికలేనివాళ్లు ఏ కరెంటు స్తంభం వెనకో, ఏ చింతచెట్టు వెనకో దాక్కుని మూత తెరిచి ముక్కు మూసుకుని లాగేస్తారన్నమాట. ఆ తర్వాత వాళ్ల ఆటాపాటా ఆ జోరు వేరుగా ఉంటుంది కానీ మన డైలీ రొటీన్‌కి దీనివల్ల కీడు జరగదు అని సందేహపడింది డాగీ.

దుకాణం ఎదురుగ్గా తచ్చాడుతున్న వీధి కుక్కల్లో ఒకటి వచ్చి డాగీ చెవిలో ఓ మాట ఊదింది. ఒకడెవడో పొద్దున్నే పీకల్దాకా మందుకొట్టి మాంసం కొట్టులో మాంసం కొని ఊగులాడుతూ మెట్లు దిగుతున్నాడు. వీడి వాలకం చూస్తుంటే పట్టపగలే చుక్కలు చూస్తున్నట్టున్నాడు. చేత పట్టుకున్న మాంసం కవరు మలేరియా వచ్చినవాడిలా ఊగుతున్నది అని ఆ గుసగుసకి అర్థం. తక్షణ కర్తవ్యం స్ఫురించి వాడ్ని ఫాలో అయింది డాగీ. డాగీని మిగిలిన స్ట్రీట్ డాగ్స్ ఫాలో చేసేయి. ఒకచోట మందుబాబు తూలి కిందపడబోయేడు. మంచి సమయం మించిన దొరకదు అనుకున్న డాగీ ఒక లాంగ్ జంపూ, ఓ హైజంపూతో వాడి చేతిలో కవరు అందుకుని ఎదురుగ్గా ఉన్న గల్లీలోకి జొరబడింది. మిగిలిన వీధి కుక్కలూ డాగీ ఓ నిర్మానుష్య ప్రదేశంలో నిలబడి మాంసాన్ని పంచుకుని 'ఇది కలిసి వచ్చిన అదృష్టమూ' అని పాడుకుంటూ 'లంచ్' కానిచ్చేసాయి. కాస్సేపయితే పొద్దుగూట్లో పడుతుందనే వేళకు అరుగు ఎక్కింది డాగీ. ఏంటి 'బ్రో' హుశారుగా కనిపిస్తున్నావు అంది అప్పటికే అరుగుమీదున్న డాంకీ. ఎందుకలాగ నిపిస్తున్నది నీకు అంది డాగీ మెట్ల మీద జంపు చేసుకుంటూ తన చోటికి చేరుకుంటూ. దూరం నించి నువ్వు గుర్రంలా నాలుక్కాళ్ల మీద వస్తుంటే అనిపించింది ఏంటి విశేషం అంది డాగీ. గింజ గింజ మీదా తినేవాడి పేరు రాసుంటుందంటారు కదా. అది నిజమైంది. షాపు ముందు గంటలు గంటలు వెయిట్ చెయ్యకుండా ఓ మంచి మందు మారాజు చేతిలోని మాంసం కవర్ కొట్టేసి వీధికుక్కలం కల్సి విందు చేసుకున్నాం. ఇక నించి మందు మారాజులు 'షేక్ దాన్సు' లు చేస్తూ రోజూ కనపడ్తారులే. ఆ పక్కనే కొత్త మందుషాపు తెరిచారు కదా అంది డాంకీ. నువ్వు గనక న్యూస్ ఛానల్ పెడితే క్లిక్కయిపోతావు గురూ అంది డాగీ. అది సరే మాంసం ఎలా పంచుకున్నారు. అసలే కాట్లాడే వాళ్లు కదా తమ జాతుల వారు అంది డాంకీ. ఇప్పుడలా ఏమీలేదు. మాకూ నీతీ, నిజాయితీ మీద నమ్మకం కుదిరించి, కోర్టుల్లో న్యాయదేవత కళ్లగంతలు తీసేస్తున్నార్ట గదా, ఇక నించి న్యాయం నాలుగు కాకపోయినా రెండు కాళ్ల మీద నడుస్తుందేమో. దోచిన మాంసం అందరికీ సమానంగా పంచాను. శాంతి భద్రతలకు భంగం రాకుండా చూసుకున్నాను అంది డాగీ.

అరుగు ఎక్కుతూ అందరికీ సమానంగా పంచావా ఏమిటిది? అన్నాడు అబ్బాయి. పంచుకోడానికి లక్షలూ, కోట్లూ, ఇసుక డబ్బులూ, మందు మూటలూ మాకు ఎక్కడివి. ఏదో కక్కా ముక్కా అంతే అంది డాగీ. ఓహో అర్థం అయ్యింది. ఏదో కొట్టేసి అందరూ పంచుకున్నారన్న మాట. దోచుకో...పంచుకో...తీసుకో అన్నాడులే ఒకాయన అన్నాడబ్బాయి. అదేకదా డి.పి.టి. అంటే అంది డాంకీ. ఇదివరకు డి.బి.టి అంటే డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ అనేది ఉండేది, అది మా హరిశ్చంద్ర సామ్రాజ్యంలో. ఇప్పుడది డీబీటి నుంచి డీపీటీగా మారిందని ఓ మాజీ నాయకుడు తాజాగా ఓ కొత్త నిర్వచనం ఇచ్చాడు. ఈ మాజీలు ఎప్పుడూ ఇంతే బ్రదర్. తాము ఉన్నప్పుడు ఏదో చేశాం, ఏదో ఊడబొడిచాం. అక్కచెల్లెమ్మల్ని, అవ్వల్నీ తాతల్నీ ఉద్ధరించాం అని చంకలు గుద్దుకుంటారు అంది డాంకీ.

కొత్త సర్కారు వచ్చీరాగానే పాతవారు తమ ఘన చరిత్ర చెప్పుకోవడం కొత్తవారిలో తప్పులు వెదకడం మా పథకాలు అటక ఎక్కించారనడం, సూపర్ సిక్స్ ఏమైనావనడం ఇవన్నీ మామూలే కద. నిజమే డాంకీ పాతవారిది నిజంగా ఘన చరిత్రే అయితే సోదిలోకి లేకుండా ఎందుకు కొట్టుకుపోతారు కానీ తప్పులెన్నువారు తమ తప్పులెరుగరయా అన్నట్టు తాము చేసిన తప్పులేమిటో చూసుకోక ఎన్నికలయిన మర్నాటి నుంచే ఎన్నికయిన ప్రభుత్వాన్ని నమిలి మింగేద్దామని తొందరపడతారు. తాము వెలగబెట్టిన ఐదేళ్ల సంగతి మరిచిపోయి అవతలివాడు గోతిలో పడితే చూద్దామని కాచుక్కూచుంటారు అన్నాడు అబ్బాయి. ఎంతసేపూ మళ్లీ అధికారంలోకి రావడానికి గోతికాడ కాచుక్కూచోకపోతే, మళ్లీ ఎన్నికలు వచ్చేలోపు ప్రజల విశ్వాసం తిరిగి పొందడానికి తమ వంతు ప్రజాసేవ చేయవచ్చు కదా అంది డాగీ. అంత ఓపికా తీరికా ఎవరికుంటయి. కళ్లుమూసి తెరిచేలోగా మళ్లీ ఎన్నికలు రావాలి మళ్లీ 'పవరు' చేతికి చిక్కాలి అనుకుంటారు గాని అన్నది డాంకీ. అధికారంలో ఉంటే తప్ప ప్రజాసేవ చేయకూడదని, ప్రజల్ని పట్టించుకోకూడదని, రాబోయే ఎన్నికల గురించీ, అధికారంలో ఉన్నవాళ్ల మీద దుమ్మెత్తి పోయడంతప్ప మరో వ్యాపకం ఏమీ ఉండదన్న మాట మాజీలకి అంది డాగీ.

బడుగుల ఆత్మగౌరవం శంకరన్

మల్లేపల్లి లక్ష్మయ్య

జీవితమంతా ప్రజలకు నిబద్ధులై ఉండే అరుదైన అధికారుల గురించి ఆలోచిస్తే మొట్టమొదట మన కళ్లముందు కదలాడే ప్రత్యక్ష రూపం ఎస్ఆర్ శంకరన్‌దే. ప్రభుత్వాలు, రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, ఇతర పాలనా విభాగాలేవైనా వాటి కర్తవ్య నిర్వహణ అణగారిన వర్గాల సమస్యల పరిష్కారంలోనే ప్రతిబింబిస్తుందని మనస్ఫూర్తిగా నమ్మినవాడు శంకరన్. తాను బతికి ఉన్నంత కాలం అట్టడుగు వర్గాల, దళితుల అభివృద్ధి కోసం నిర్విరామంగా కృషి చేశారు. పేదలు, అత్యంత నిరుపేదలు అనే ఊహాజనితమైన ఆవిష్కరణలను తిప్పికొట్టి అన్ని రకాల పేదరికాలనూ, వివక్షనూ ఎదుర్కొంటున్న వర్గం కేవలం అంటరాని కులాలేనని తేల్చి చెప్పారు. పెళ్ళి చేసుకుంటే పేదలకోసం పూర్తిగా పని చేయాలన్న ఆలోచనకు ఆటంకం కలుగుతుందని బ్రహ్మచారిగానే ఉండిపోయారు. ఎస్సీ, ఎస్టీలకు ఇళ్ల స్థలాలు, భూముల కేటాయింపునకు ఆయన చేసిన కృషి ఎనలేనిది. అంటరానితనం రూపుమాపటానికి, వారికి ప్రాథమిక హక్కులు అందుబాటులోకి తీసుకురావడానికి మరిచిపోలేని కృషిచేశారు.

పామరుల చెంతకు పాలనావ్యవస్థ

పామరుల చెంతకు పాలనావ్యవస్థను పరుగులు పెట్టించిన ఘనత ఎస్.ఆర్. శంకరన్‌దేనంటే అతి శయోక్తికాదు. తమిళనాడులోని తంజావూరులో 1934, అక్టోబర్ 22న ఆయన జన్మించారు. మదురైలో కామర్స్‌లో డిగ్రీ పూర్తిచేశారు. ఆయన ఐఏఎస్‌లో చేరకముందు లెక్చరర్‌గా కొంతకాలం పని చేశారు. 1956లో ఐఏఎస్‌లో చేరిన శంకరన్ 1959లో కర్నూలు జిల్లా నంద్యాల సబ్ కలెక్టర్‌గానూ, నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గానూ పనిచేశారు. తరువాత కేంద్ర ప్రభుత్వ సర్వీసులోకి వెళ్లారు. 1971-73లో కేంద్ర ఉక్కు, గనుల శాఖామంత్రిగా ఉన్న కుమార మంగళంకు స్పెషల్ అసిస్టెంట్‌గా కూడా పనిచేశారు. బొగ్గు గనులను జాతీయం చేసే కార్యక్రమంలో ఎస్.ఆర్. శంకరన్ పాత్ర అత్యంత కీలకమైనది. బొగ్గుగని కార్మికులు బానిసలుగా జీవిస్తున్న స్థితిలో వారికి రాజ్యాంగపరమైన హక్కులను కల్పించడంలో శంకరన్ కృతకృత్యులయ్యారు.

సాంఘిక సంక్షేమానికి ఆద్యుడు

కారణాలేవైనప్పటికీ 1974 ప్రాంతంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ దళితుల, ఆదివాసీల విషయంలో చేసిన కీలక నిర్ణయాలు, ఎస్సీ, ఎస్టీల పట్ల అనుసరించిన వైఖరి శంకరన్ లాంటి అభ్యుదయ అధికారుల చేతిలో శక్తివంతమైన ఆయుధంగా మారాయి. హైదరాబాద్‌లో 1976లో నిర్వహించిన హరిజన కాన్ఫరెన్స్ హరిజన పదం వాడకం అవమానకరమైనదనీ, దాన్ని ఇకపై వాడకూడదనీ తీర్మానించింది. తదనంతర కాలంలో ఆ తీర్మానమే ప్రభుత్వ ఉత్తర్వుగా రూపుదిద్దుకుంది. అప్పటినుంచి ప్రభుత్వ రికార్డుల్లో హరిజన అనే పదం స్థానంలో షెడ్యూల్డ్ కులాలు అని చేర్చారు. ఈ సదస్సులో ఎస్సీల సమస్యలపై దాదాపు 322 సిఫారసులను సూచించారు. అందులో 224 తీర్మానాలు ఆమోదించారు. ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం దళిత, ఆదివాసీల అభ్యున్నతికి బాటలువేసే అత్యంత సాహసోపేతమైన నిర్ణయాలెన్నో చేసిన ఎస్.ఆర్. శంకరన్ ఒక్క ఏడాదిలోనే దాదాపు 120 ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయడం ఐఏఎస్ అధికారుల చరిత్రలో అరుదైన సందర్భం. 120 జీఓల్లో 100కి పైగా శంకరన్‌గారి సింగిల్ సిగ్నేచర్‌తో ఉండడం నిజాయితీ కలిగిన, పాలనాధికారులకు ఒక గొప్ప సందేశాన్నిస్తోంది. హరిజన సంక్షేమ మంత్రిత్వశాఖ పేరును సాంఘిక సంక్షేమ శాఖగా మార్పు చేయడం ఈ జీఓల్లో ఒకటి.

దళితుల, ఆదివాసీల గురించి జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో సైతం అత్యంత స్పష్టంగా వివక్ష కనిపిస్తూంటుంది. వీరికోసం ప్రభుత్వం నిర్మించి ఇస్తున్న ఇళ్లన్నీ వెలివేసినట్టు ఊరుచివరే నిర్మిస్తారు. గ్రామం వెలుపల కాకుండా, గ్రామం మధ్యలోనే వీరి ఇళ్లు నిర్మించాలనీ, దళితుల వాడల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలనీ, రేషన్ షాపులను దళితులకే కేటాయించాలనీ, దళితుల పిల్లలకు పౌష్టికాహారం, గ్రామ పంచాయతీల్లో దళిత మహిళలకు రిజర్వేషన్లు, ఒంటరి దళిత మహిళలకు ఇళ్ల స్థలాలు, కులాంతర వివాహాలకు ప్రోత్సాహకాలు, వ్యాపార, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో శిక్షణ, ఇనాం భూములకు పట్టాలు, ప్రభుత్వ హౌసింగ్ కాలనీల్లో దళితులకు ఇళ్ల కేటాయింపుల్లో ప్రాధాన్యం, స్థానిక సంస్థల బడ్జెట్‌లో 15 శాతం నిధులను దళితుల అభివృద్ధికి ప్రత్యేకించి కేటాయించడం కుల నిర్మూలన అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చడం, దళిత వాడల్లో విద్యుదీకరణ, పబ్లిక్ స్కూల్స్‌లో రిజర్వేషన్లు దళిత వాడల్లో పాఠశాలల ఏర్పాటు లాంటివి వంద జీవోల్లో కొన్ని మాత్రమే.

> భారత రాజ్యాంగం అత్యున్నతమైనది. విశిష్టమైనది. అధిపతులూ, అధికారులూ, పరిపాలకులూ ఈ దేశంలో ఎంతటి అత్యున్నత పదవిలో ఉన్న వారైనా భారత రాజ్యాంగానికి బద్ధులై ఉండాల్సిందే. భారతదేశ ప్రజాస్వామ్య విలువలను కాపాడి, పాలనను కొనసాగించే వ్యవస్థలు మూడు. అందులో ఒకటి శాసన వ్యవస్థ. రెండు అధికార వ్యవస్థ. మూడు న్యాయ వ్యవస్థ. ఈ మూడింటిలో శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ కేవలం విధానాలూ, చట్టాల, రూపకల్పనలో ప్రధాన పాత్ర వహిస్తాయి.

రెండో వైపు షెడ్యూల్డ్ తెగలైన ఆదివాసీలకు అభివృద్ధిపై కూడా ఆయన దృష్టి సారించారు. ఆదివాసీల కోసం ప్రత్యేక సమీకృత ఆదివాసీ అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)లను ఏర్పాటు చేయడంలో శంకరన్ కృషి మరువలేనిది. పైగా ఎస్సీ, ఎస్టీ పిల్లలకు మెరుగైన విద్యనందించే లక్ష్యంతో ప్రత్యేక హాస్టళ్లను ప్రారంభించిన ఘనత కూడా శంకరన్‌దే. 1976లో వచ్చిన వెట్టిచాకిరీ నిషేధ చట్టం ఆయన కృషి ఫలితమే. ఎందరినో భూస్వాముల చెర నుంచి విముక్తి చేసి పునరావాసం కల్పించారు. ఈ విషయమై 1978లో అధికారంలోనికి వచ్చిన ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డితో వచ్చిన విభేదాల కారణంగా త్రిపుర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బదిలీపై వెళ్లారు. అక్కడ కేంద్ర పారామిలిటరీ దళాల అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎంతో కృషి చేశారు.

1983లో తెలుగుదేశం పార్టీ అధికారాన్ని చేపట్టిన అనంతరం ఆయన తిరిగి మన రాష్ట్రానికి వచ్చారు. సోషల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బాధ్య తలు స్వీకరించారు. రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు, స్కాలర్‌షిప్‌ల పెంపుదల, విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల అమలు కోసం కృషి చేశారు. 1985లో ప్రకాశం జిల్లా కారంచేడులో జరిగిన దారుణానికి చలించిపోయిన ఎస్ఆర్.శంకరన్ ప్రభుత్వ పెద్దలను ధిక్కరించి కొన్ని సాహసోపేత నిర్ణయాలు చేశారు.

నక్సలైట్లతో చర్చలు

పదవీ విరమణ తర్వాత మూడు ముఖ్యమైన విష యాలలో క్రియాశీలకంగా ఆయన పనిచేశారు. అందులో పౌరస్పందన వేదిక (కన్‌సర్న్డ్ సిటిజన్స్ కమిటీ) ఒకటి. ప్రభుత్వానికీ నక్సలైట్లకూ మధ్య జరుగుతున్న పోరులో కోల్పోతున్న పౌరుల ప్రాణాలను కాపాడేందుకు మానవీయ దృక్పథంతో మేధావులను కూడగట్టి పౌరస్పందన వేదికను ఏర్పరిచారు. 1997లో ఏర్పాటైన ఈ వేదిక ప్రభుత్వానికీ నక్సలైట్ల మధ్య చర్చలు జరగడానికి తీవ్రంగా కృషి చేసింది. దాని ఫలితంగా 2004లో అధికారంలోకి వచ్చిన వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో నక్సలైట్లను చర్చలకు ఆహ్వానించడం భారతదేశ చరిత్రలోనే అరుదైన సంఘటన. ఆ తర్వాత ఆయన దృష్టి మొత్తం పాకీపనివారి విముక్తిపై సారించారు. దళిత మానవ హక్కుల కార్యకర్త బెజవాడ విల్సన్‌తో కలిసి సఫాయి కర్మచారీ ఆందోళన్ అనే సంస్థను ఏర్పాటు చేశారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో ప్రారంభమైన ఈ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేయడం కోసం శంకరన్ చేసిన ప్రయత్నం అద్వితీయమైనది. ప్రభుత్వ పాలనలో తన అనుభవాన్ని ఉపయోగించి ఆ సమస్యపై దేశ వ్యాప్తంగా చర్చకు తెరదీశారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చే విధంగా సుప్రీంకోర్టులో వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఆ ఉద్యమం వల్ల చేతితో మలం ఎత్తే అమానవీయపని నుంచి ఎందరో బయటపడ్డారు.

భారత రాజ్యాంగం అత్యున్నతమైనది. విశిష్టమై నది. అధిపతులూ, అధికారులూ, పరిపాలకులూ ఈ దేశంలో ఎంతటి అత్యున్నత పదవిలో ఉన్న వారైనా భారత రాజ్యాంగానికి బద్ధులై ఉండాల్సిందే. భారతదేశ ప్రజాస్వామ్య విలువలను కాపాడి, పాలనను కొనసాగించే వ్యవస్థలు మూడు. అందులో ఒకటి శాసన వ్యవస్థ. రెండు అధికార వ్యవస్థ. మూడు న్యాయ వ్యవస్థ. ఈ మూడింటిలో శాసన వ్యవస్థ, న్యాయ వ్యవస్థ కేవలం విధానాలూ, చట్టాల, రూపకల్పనలో ప్రధాన పాత్ర వహిస్తాయి. కానీ శాసన న్యాయ వ్యవస్థలు అంతగా ప్రజలకి చేరువ కావు. అయితే అధికార వ్యవస్థ నిత్యం ప్రజలమధ్యే ఉండాల్సి ఉంటుంది. వీరెప్పుడూ ప్రజలకు, రాజ్యాంగానికీ మాత్రమే జవాబు దారీగా ఉండాలి. ప్రభుత్వంలోని బ్యూరోక్రాట్స్ కానీ, అధికారంలో ఉన్న పెద్దలెవరైనా, ఇతర ఆధి పత్యశక్తుల ఆజ్ఞలకు లోబడి పనిచేయాల్సిన అవసరం లేదు. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే ప్రభుత్వా లను నడిపే ముఖ్యమంత్రులనూ, మంత్రులనూ ఎదిరించి రాజ్యాంగం అమలు కోసం నిలబడే శక్తిసామర్థ్యాలు వీరికి కావాలి.

చెరువుల వృద్ధి అవశ్యం

ప్రసాద్ కె.వి.వి.

ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా సాగునీటి వనరుల వినియోగం అత్యంత ప్రధానమైనది. పూర్వకాలంలో నీటి వనరుల వినియోగానికి చెరువులే ఆధారం. అధునికకాలంలో నదులపై ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి తద్వారా భూముల సాగుకు శ్రీకారం చుట్టడం ప్రారంభించారు. ఆశయం ఎంత గొప్పదైనా పలు ప్రతిబంధకాలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం, ఆర్థిక సమస్యలతో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ఏ మాత్రం ముందుకు సాగడంలేదు. దశాబ్దాలు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. "ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే" అన్న సామెతను గుర్తుకు తెస్తున్నాయి. ఫలితంగా ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతూ మరింత భారంగా మారుతున్నాయి. మరో ప్రక్క శ్రీకాకుళం, పార్వతిపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో సుమారు 21,000 వేల చెరువులు గత కాలపు చిహ్నాలుగా ఇరిగేషన్‌శాఖ ఘణాంకాలలో నిక్షిప్తమై ఉన్నాయి. అయితే ఈ చెరువులు అత్యధికభాగం ఆక్రమణకుగురై పాలకుల ప్రజల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి. ఈ జిల్లాల్లో సుమారు 23.24 లక్షల ఎకరాల సారవంతమైన పంట భూములుండగా కేవలం 8 లక్షల ఎకరాలకు అది కూడా ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంగానూ, ప్రాజెక్టులు, చెరువులు, కాలువుల ద్వారా సాగునీరు అందుతుంది. మన దేశంలో అత్యంత పేదరికం ఉన్న ప్రాంతాల్లో ఉత్తరాంధ్ర కూడా ఉందనేది అనేక నివేదికలు తెలుపుతున్నాయి.

రాష్ట్ర విభజన సమయంలో శ్రీకృష్ణ కమిటీ నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసింది. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల్లో వ్యవసాయరంగంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు 13వ స్థానంలో ఉండగా విశాఖ జిల్లా 11వ స్థానంలో ఉంది. అత్యధిక శాతం మంది ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయరంగాన్ని పరిగణలోకి తీసుకుంటే ఈ ప్రాంతం ఎంత వెనుకబడి ఉందో చెప్పడానికి ఇదొక్కటే చక్కటి ఉదాహరణ. కృష్ణా,గోదావరి డెల్టా ప్రాంతంలో 25 లక్షల ఎకరాలకు పైగా రెండో పంటకు నీరు అందుతుండగా ఉత్తరాంధ్రలో రెండవ పంటకు సాగునీరు అందుతున్నది కేవలం 7% మాత్రమే. అభివృద్ధి చెందిన ప్రాంతాలపై ప్రేమ చూపుతున్న పాలకులు వెనుకబడిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి విషయంలో తీవ్ర అన్యాయం చేస్తున్నారు. ఆనాడు కేవలం రూ. 7,000 కోట్లు కేటాయించి ఉంటే ఈరోజు రెండు పంటలతో కృష్ణా, గోదావరి డెల్టాతో అభివృద్ధిలో మన ప్రాంతం కూడా పోటీపడి ఉండేది. పై అంశాన్ని పరిశీలిస్తే అభివృద్ధి పదం వైపుప్రయాణింప చేయవలసిన పాలకులు వెనుకబడిన ప్రాంతమైన ఉత్తరాంధ్రపై చూపుతున్న సవతి తల్లి ప్రేమకు ఇదొక తార్కాణంగా చెప్పవచ్చు.

దేశంలో అత్యధిక వర్షపాతం నమోదవుతున్న ప్రాంతాలలో ఉత్తరాంధ్ర కూడా ఒకటి. సరాసరి 1050 మిల్లీమీటర్ల వర్షపాతంతో నిండు కుండలా పారుతున్న నదులు, వాగులు, గెడ్డలకు కొదవలేదు. లక్షల ఎకరాలు సాగు కల్పించే తోటపల్లి, వంశధారతో పాటు అనేక నదులపై ఇప్పటికే 20-30 ఏళ్ల నుంచి అనేక ప్రాజెక్టులు కట్టి నిధులు సమకూర్చి పూర్తి చేయకుండా పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్నది మన ప్రాంతం. బీడువారిన భూములతో వర్షాల కోసం ఎదురుచూస్తు పంటల కోసం తెచ్చిన పెట్టుబడులు తిరిగిరాక రైతన్నలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నా పాలకుల కళ్ళకు కనిపించడంలేదు. మన ప్రాంత ప్రజల పేదరికాన్ని, మంచి తనాన్ని అలుసుగా తీసుకుని మన ప్రాజెక్టుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వకపోవడం నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం వహించడం అత్యంత దుర్మార్గం. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితులు ఉండబట్టే ఆనాడు శ్రీకాకుళ గిరిజన రైతాంగ ఉద్యమం ఉవ్వెత్తున సాగిందనే వాస్తవాన్ని పాలకులు విస్మరించరాదు.

గోదావరినది జలాలల్లో మూడు వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలిసిపోతున్నది. మన ప్రాంత హక్కుగా ఉన్న 63 టీఎంసీలలో విశాఖ పారిశ్రామిక అవసరాలకు పోను, 53 టీఎంసీల సాగు నీరు ఇచ్చుటకు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టువల్ల ఉత్తరాంధ్రలో 18 నియోజకవర్గాలు, 48 మండలాలకు చెందిన దాదాపు 1200కు పైగా గ్రామాలలోని సుమారు 30 లక్షల మంది ప్రజలకు త్రాగునీరు, 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న ప్రాజెక్టును పాలకులు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నారు. ఫలితంగా మన ప్రాంతం నుండి కృష్ణా,గోదావరి డెల్టాతో పాటు పలు నగరాలు, పట్టణాలకు అతి తక్కువ వేతనంతో కూలీలను సరఫరా చేసే కేంద్రంగా ఉత్తరాంధ్ర ప్రాంతం ఉందనేది తేటతెల్లం.

తక్షణమే ఉత్తరాంధ్రలోని ప్రాజెక్టుల నిర్మాణానికి రాబోయే బడ్జెట్లో నిధులు కేటాయించి ఈ ప్రాంత రైతాంగానికి విశ్వాసం కలగజేసే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని, సుమారు 21 వేల ఇరిగేషన్ చెరువుల ఆక్రమణలపై దృష్టిసారించి వాటి అభివృద్ధికి కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్ చేస్తున్నది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురవుతున్న సాగు, త్రాగునీటి ప్రాజెక్టుల పూర్తికై ప్రభుత్వం దృష్టి సారించేలా ఒత్తిడి తెచ్చేందుకు అన్నివర్గాల ప్రజలను కదిలించే లక్ష్యంతో అక్టోబరు 22 (మంగళవారం) అనకాపల్లి పట్టణంలోని రోటరీ హాల్‌లో " భారీ రైతు సదస్సు" ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నిర్వహిస్తున్నది. ఈ సదస్సులో ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి కన్వీనర్, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్, సాగునీటి రంగ నిపుణులు టి. లక్ష్మీనారాయణ, ఇరిగేషన్‌శాఖ రిటైర్డ్ యస్.ఈ. సత్యనారాయణ రాజు, ఉత్తరాంధ్రప్రాంత రైతు ప్రముఖులు, సాగు నీటిరంగ ప్రముఖులు, మేధావులు పాల్గొంటారు.

మదార్సాలకు నిధులివ్వొద్దు...

ఎన్‌సీపీసీఆర్ సిఫార్సులపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ: గుర్తింపు లేని మదర్సాల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని, మదర్సా బోర్డులకు నిధులు ఇవ్వొద్దని రాష్ట్రాలను కోరుతూ బాలల హక్కుల సంఘం చేసిన సిఫార్సులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మదార్సాల్లో విద్యాహక్కు చట్టాన్ని పాటించడంలేదని, అక్కడ బోధించే విద్య... విద్యార్థులకు ఎందుకూ పనికిరాదని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) ఇప్పటికే సుప్రీంకోర్టుకు తెలిపింది. కాగా, ఈ ఏడాది జూన్ ఏడు, 25 తేదీల్లో గుర్తింపు లేని మదర్సాల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించడంతో ఉత్తరప్రదేశ్, త్రిపుర ప్రభుత్వాలు వీటిని అమలు చేయడానికి ఆదేశాలు జారీ చేశాయి. దాంతో ఈ ప్రభుత్వాల చర్యలను వ్యతిరేకిస్తూ ముస్లిం సంస్థ జమియాత్ ఉలేమా-ఇ-హింద్ సుప్రీంలో పిటిషన్ వేసింది. ఈ రాష్ట్రాలు ఇచ్చిన ఉత్తర్వులపై కూడా సుప్రీం స్టే విధించింది.

'నిజ్జర్ హత్య కేసుతో నాకేం సంబంధం లేదు

- ట్రూడో వల్ల మొత్తం నాశనం
- భారత హైకమిషనర్ సంజయ్ కుమార్

న్యూఢిల్లీ: ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్యోదంతంలో తన పాత్ర లేదని భారత హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మ స్పష్టం చేశారు. ఈ కేసులో తన పాత్ర ఉందని కెనడా సర్కార్ ఆరోపణలు చేస్తున్నప్పటికీ ఎలాంటి ఆధారాలు సమర్పించలేదని చెప్పారు. ఇది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, నిజ్జర్ హత్యతో తనకు అసలు సంబంధం లేదని ఓ మీడియా సంస్థ మాట్లాడుతూ తెలిపారు. కెనడాలో సిక్కు వేర్పాటువాదులను భారత ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని ట్రూడో సర్కార్ చేసిన ఆరోపణలను వర్మ తోసిపుచ్చారు. సిక్కు వేర్పాటువాదుల సమాచారాన్ని రాయబారులు ఇండియాకు అందిస్తే నేర ముఠాల ద్వారా భారత్ వారిని చంపేస్తోందని కెనడా ఆరోపించింది. వాటిని కూడా సంజయ్ వర్మ ఖండించారు. కెనడాలో భారత హై కమిషనర్‌గా తాను ఎప్పుడూ అలాంటి పనులు చేయలేదన్నారు. భారత్ ఏ తరహా చర్య తీసుకున్నా అది బహిరంగంగానే జరిగిందని స్పష్టం చేశారు. భారత్-కెనడా సంబంధాలను ట్రూడో నాశనం చేశారని మండిపడ్డారు. ఒట్టావా చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని వ్యాఖ్యానించారు. నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సహా పలువురు దౌత్యవేత్తలను కెనడా ప్రభుత్వం అనుమానితులుగా పేర్కొనడంపై ఇటీవల భారత్ తీవ్రంగా స్పందించింది. ఆరుగురు కెనడా దౌత్యవేత్తలను దేశం నుంచి బహిష్కరించింది. దీనికి ప్రతిగా కెనడా ప్రభుత్వం భారత హై కమిషనర్ సంజయ్ వర్మ సహా ఆరుగురు దౌత్యవేత్తలను బహిష్కరించింది. మరోవైపు, ఇటీవల భారత క్రిమినల్ గ్యాంగ్‌ల నుంచి కెనడా వాసులకు ఇప్పటికిప్పుడు ఎలాంటి ముప్పులేదని రాయల్ కెనేడియన్ మౌంటెడ్ పోలీస్ అధికారిణి బ్రిగెట్టే గౌవిన్ ఓ ఇంటర్వ్యూలో అన్నారు. ఆ దేశానికి చెందిన సీబీసీ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని హింసలో భారత ప్రభుత్వ హస్తం ఉందంటూ ఆర్సీ ఎంపీ కొన్నాళ్ల క్రితమే ఆరోపించారు. ఈ నేపథ్యంలో బ్రిగెట్టే వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

స్కూల్ బస్సు బోల్తా...

ఒకరి మృతి, ఇద్దరి పరిస్థితి విషమం

జైపూర్: పిల్లలను తీసుకెళ్తున్న స్కూల్ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా ఇద్దరు పిల్లల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాజస్థాన్‌లోని కోటాలో ఈ సంఘటన జరిగింది. సోమవారం మధ్యాహ్నం పిల్లలను ఇంటికి తరలిస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోయాడు. దీంతో రోడ్డు దిగువకు దూసుకెళ్లి బోల్తా పడింది. గమనించిన స్థానికులు వెంటనే ఆ స్కూల్ బస్సు వద్దకు చేరుకుని అద్దాలు పగులగొట్టి పిల్లలను బయటకు తెచ్చారు. సుమారు 50 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఒకరు మరణించగా ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలుస్తున్నది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన పిల్లలను హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. స్కూల్ బస్సు ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెదిరించే వారికి జీవిత ఖైదు

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

న్యూఢిల్లీ: విమానాలకు బెదిరింపులు పంపితే జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్టు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మీడియాతో సోమవారం ఆయన మాట్లాడుతూ... విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని, బెదిరింపులకు పాల్పడేవారిని విమానాల్లో ప్రయాణిం చకుండా ఉండే జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు వచ్చిన బెదిరింపులు మొత్తం బూటకమని తేలిందన్నారు. పౌర విమానయాన శాఖకు కఠినమైన ప్రొటోకాల్ ఉందని... దానినే తమ శాఖ, విమానయాన సంస్థలు అనుసరిస్తున్నా యని వివరించారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు తప్పదన్నారు. విమానంలో బోర్డింగ్ అయ్యాక బెదిరింపులకు పాల్పడేవారికి ఇటువంటి శిక్ష విధించేలా ఇప్పటికే చట్టంలో సెక్షన్లు ఉన్నాయన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉంటూ బెదిరింపులకు పాల్పడేవారికి కూడా వీటిని వర్తింపజేసేం దుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. అక్టోబరు 14 నుంచి పలు విమానాలకు దాదాపు 100 బెదిరింపులు వచ్చాయి. ఈ అంశంపై పలు వర్గాలతో సమావేశాలు నిర్వహించినట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానయాన భద్రతా నిబంధనల సవరణ కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. 1982 సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ చట్టాన్ని సవరించే అంశంపై వివిధ శాఖలతో కూడా చర్చిస్తున్నట్లు వివరించారు. 'గత వారం పలు విమానాలకు బెదిరింపులు రావడంతో వేరే మార్గాలకు మళ్లించాం. ప్రతి దానిని ప్రత్యేకంగా విశ్లేషించి వేగంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకొన్నాం. అవి తప్పుడు బెదిరింపులైనా... భద్రత, సురక్షిత విషయంలో రాజీ పడటంలేదు. ప్రయాణికుల ప్రాణాలు కాపాడడమే మాకు ముఖ్యమన్నారు. హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి వీటిపై దర్యాప్తును వేగవంతం చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మెరుగైన పరిస్థితిని చూస్తాం' అని కేంద్ర మంత్రి చెప్పారు. శనివారం ఒక్కరోజే 30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా... ఆదివారం సైతం 24 విమానాలకు వచ్చాయి. ఇండిగో, విస్తారా, ఎయిరిండియా, ఆకాశ ఎయిర్‌తోపాటు పలు అంతర్జాతీయ సర్వీసు విమానాలు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ బెదిరింపుల గురించి సంబంధిత అధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు భద్రతా విధానాలను పాటిస్తున్నామని విమానయాన సంస్థల ప్రతినిధులు వెల్లడించారు. ఈ వారంలో 90కిపైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా, అవన్నీ నకిలీవేనని అధికారులు తేల్చారు.

ఉగ్రవాదంపై పోరులో దేశం ఒక్కటిగా ఉంది

రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని గందర్‌బల్‌లో ఉగ్రదాడిపై తాజాగా రాహుల్ గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడిలో వైద్యుడు, వలస కూలీలను ఉగ్రవాదులు చంపడం అత్యంత పిరికి పని అని, క్షమించరాని నేరమని ఆయన అన్నారు. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని, అలాగే క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఉగ్రవాదుల ఈ దుస్సాహసం జమ్మూకశ్మీర్‌లో జీవన విధానాన్ని, ప్రజల విశ్వాసాన్ని ఎప్పటికీ విచ్ఛిన్నం చేయదని రాహుల్ గాంధీ అన్నారు. ఉగ్రవాదంపై పోరులో దేశం మొత్తం ఏకమై ఉందని ఉద్ఘాటించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా స్పందించారు. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా తాజాగా ఉగ్ర దాడిని ఖండించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. జమ్మూకశ్మీర్‌లోని సోనామార్గ్‌లోని గగాంగీర్‌లో కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులో నిమగ్నమై ఉన్న అమాయక కార్మికులపై జరిగిన ఉగ్రదాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నానని గడ్కరీ అన్నారు. ఈ క్లిష్ట సమయంలో అమరులైన కార్మికులకు నా వినయపూర్వకమైన నివాళులర్పిస్తున్నాను. ఇంకా వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా, పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన రాసుకొచ్చారు.

పోలీస్ రిక్రూట్‌మెంట్ వేగవంతం చేస్తారా...

చేతులు జోడించి డీజీపీని అభ్యర్థించిన సీఎం నితీశ్

పాట్నా: బీహార్ సీఎం నితీశ్ కుమార్ మరోసారి తనదైన శైలిలో వ్యవహరించారు. పోలీస్ రిక్రూమ్‌మెంట్‌ను వేగవంతం చేయాలంటూ చేతులు జోడించి డీజీపీని అభ్యర్థించారు. ఇది చూసి అక్కడున్న వారంతా షాక్ అయ్యారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. కొత్తగా నియమితులైన 1,239 మంది పోలీసు అధికారులకు నియామక ఉత్తర్వులను సోమవారం సీఎం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌ను వేగవంతం చేయాలని, పోలీస్ శాఖలో మహిళల సంఖ్యను 35 శాతానికి పెంచాలని హోం శాఖ కార్యదర్శి, డీజీపీని కోరారు. నితీశ్ కుమార్ చేతులు జోడించి డీజీపీ అలోక్ రాజ్ వైపు తిరిగి మాట్లాడారు. 'రిక్రూట్‌మెంట్‌ను మీరు త్వరగా పూర్తిచేస్తారా?' అని అడిగారు. బీహార్‌లో శాంతిభద్రతల పరిస్థితిపై ప్రతిపక్షాలు ఆరోపిస్తున్న నేపథ్యంలో ఆయన ఈవిధమైన వ్యాఖ్యలు చేశారు. కాగా, ఆ రాష్ట్ర డీజీపీ అలోక్ రాజ్‌తోపాటు ఆ వేదికపై ఉన్న వారు ఇది చూసి షాక్ అయ్యారు. డీజీపీ వెంటనే కుర్చీ నుంచి పైకి లేచి సీఎం నితీశ్ కుమార్‌కు సెల్యూట్ చేశారు. ఆ తర్వాత మైక్ వద్దకు వెళ్లి ఆయన మాట్లాడారు. 'గౌరవనీయులైన ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేయడానికి బీహార్ పోలీసులు కట్టుబడి ఉన్నారు. మేం త్వరగా రిక్రూట్‌మెంట్ నిర్వహించి పటిష్టమైన శిక్షణ ఇస్తాం' అని అన్నారు. దీంతో 'ధన్యవాదాలు' అని సీఎం నితీశ్ కుమార్ బదులిచ్చారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరలైంది.

కొత్తగా పెళ్లి చేసుకునే జంటలు

16 మంది పిల్లల్ని కనాలి: సీఎం స్టాలిన్

చెన్నై: కొత్తగా పెళ్లి చేసుకునే జంటలు ఎక్కువ మంది పిల్లల్ని కనాలని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కోరారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా 16 రకాల సంపదలకు బదులుగా 16 మంది పిల్లలను కనాల్సిన సమయం వచ్చిందని అన్నారు. ఆ రాష్ట్ర హిందూ మత, ధర్మదాయ శాఖ సోమవారం సామూహిక వివాహ కార్యక్రమం నిర్వహించింది. సీఎం స్టాలిన్ సమక్షంలో 31 జంటలకు వివాహం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొత్తగా పెళ్లైన జంటలు 16 మంది పిల్లలను కనాల్సిన పరిస్థితి ప్రస్తుతం ఉందన్నారు. కాగా, పూర్వ కాలంలో కొత్తగా పెళ్లైన జంటలు 16 రకాల సంపదలు పొందాలని పెద్దలు ఆశీర్వదించేవారని సీఎం స్టాలిన్ గుర్తు చేశారు. 'మీకు 16 కలిగి సుభిక్షంగా జీవించాలని పెద్దలు కోరుకునేవారు. అంటే 16 మంది పిల్లలు కాదు, 16 రకాల సంపదలను సూచిస్తుంది. వీటిని 'ఆవు, ఇల్లు, భార్య, పిల్లలు, విద్య, జిజ్ఞాస, జ్ఞానం, క్రమశిక్షణ, భూమి, నీరు, వయస్సు, వాహనం, బంగారం, ఆస్తి, పంట, ప్రశంసలు' అని రచయిత విశ్వనాథన్ తన పుస్తకంలో పేర్కొన్నారు' అని వివరించారు. కొత్త జంటలను 16 రకాల సంపదలు పొందాలని ఇప్పుడు ఎవరూ ఆశీర్వదించడం లేదని, తగినంత సంతానం కలిగి సుఖంగా జీవించాలని మాత్రమే అనుగ్రహిస్తారని చెప్పారు. కాగా, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు కూడా ఇటీవల జనాభా సమతుల్యతపై వృద్ధాప్య జనాభా ప్రభావంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబాలు ఎక్కువ మంది పిల్లలను కలిగి ఉండాలని కోరారు. ఇద్దరు లేదా అంత కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్న వ్యక్తులు మాత్రమే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి అనుమతించే చట్టాన్ని తెచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేస్తున్నదని వెల్లడించారు.

పిలవకపోయినా విజయ్ ర్యాలీకి వెళ్తా: విశాల్

చెన్నై: 'తమిళగ వెట్రి కళగం' పార్టీతో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తమిళ నటుడు విజయ్ వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే త్వరలోనే తొలిసారి బహిరంగ సమావేశం నిర్వహించనున్నారు. ఈ ర్యాలీ గురించి తాజాగా మరో నటుడు విశాల్ స్పందిస్తూ ... విజయ్ సభపై తాను ఆసక్తిగా ఉన్నానని, పిలవకపోయినా తాను అక్కడికి వెళ్తానని అన్నారు. చెన్నైలో విశాల్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా 'విజయ్ పొలిటికల్ ర్యాలీకి హాజరవుతున్నారా?' అంటూ విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. 'నాకు ఓటు హక్కు ఉంది. విజయ్ తన తొలి ప్రసంగంలో ఎలాంటి హామీలు ఇస్తారనేది ఒక ఓటరుగా తెలుసుకోవాలనుకుంటున్నా. ప్రస్తుతమున్న రాజకీయ నాయకుల కంటే భిన్నంగా విజయ్ ఆలోచనలు ఎలా ఉన్నాయో చూడాలనుకుంటున్నా. దీనికి నాకు ఆహ్వానం అవసరం లేదు. టీవీలో చూడటం కంటే సభకు వెళ్లి సాధారణ ప్రజల మధ్య ఒకడిగా నిలబడి తెలుసుకుంటేనే ఇంకా బాగుంటుందనేది నా అభిప్రాయం' అని విశాల్ చెప్పారు. విజయ్ టీవీకే పార్టీలో తాను చేరినట్లు వస్తున్న ఊహాగానాలను విశాల్ కొట్టిపారేశారు. 'ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. ముందు విజయ్‌ని తన తొలి సభను విజయవంతంగా నిర్వహించనివ్వండి. ఆయన మేనిఫెస్టో ఎలా ఉందో తెలుసుకుందాం. దానికి (పార్టీలో చేరడానికి) ఇంకా సమయం ఉంది' అని పేర్కొన్నారు. విల్లుపురంలోని విక్రవండిలో ఈ నెల 27న టీవీకే రాష్ట్రస్థాయిలో తొలిసారిగా బహిరంగ సమావేశం ఏర్పాటుకు సిద్ధమైంది. భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తోంది. పార్టీ కార్యకర్తలను ఉద్దేశిస్తూ ఓ లేఖ విడుదల చేసిన విజయ్... 'కర్తవ్యం, గౌరవం, క్రమశిక్షణ' అనే సూత్రాన్ని పాటించాలని సూచించారు.

హర్యానా ఎన్నికలు సుస్థిరత సందేశాన్ని బలపర్చాయి

ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: తమ ప్రభుత్వానికి వరుసగా మూడు పర్యాయాలు ఆదేశంతో ప్రజలు సుస్థిరత అనే సందేశాన్ని ఇచ్చారని, ఇటీవలి హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సుస్థిరత వ్యక్తీకరణను వారు బలపరిచారని ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం అన్నారు. ఇక్కడ జరిగిన 'ఎన్‌డీ టీవీ ప్రపంచ సదస్సు'లో ప్రారంభోపన్యాసం చేస్తూ భారత్ అభివృద్ధి చెందుతున్న దేశమని, ఎదుగుతున్న శక్తిగా కూడా ఉందన్నారు. ప్రపంచం మొత్తం కొవిడ్, యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బంది పడుతున్న వేళ కూడా మన దేశంలో 'భారత్ శతాబ్ది' గురించి ఆలోచిస్తున్నారని అన్నారు. భారతదేశానికి 'డబుల్ ఏఐ' ప్రయోజనం ఉందని, 'ఆకాంక్ష భారతదేశం', 'కృత్రిమ మేధస్సు' శక్తి కలిసినప్పుడు అభివృద్ధి వేగంగా జరగడం సహజమని చెప్పారు. సంక్షోభ సమయాల్లో భారతదేశం స్నేహితుడిగా ఉందని, కోవిడ్ మహమ్మారి సమయంలో దేశం అనేక దేశాలకు టీకాలను ఎలా పంపిందో మోదీ ఉదహరించారు. 'భారత్‌కు 'టేక్ ఫర్ గ్రాంటెడ్' సంబంధాలు లేవు. దాని సంబంధాలు నమ్మకం, విశ్వసనీయతపై నిర్మితమయ్యాయి. భారతదేశం ముందుకు సాగినప్పుడు అసూయ ఉండదు. కానీ దాని పురోగతి ప్రపంచానికి ప్రయోజనం చేకూరుస్తుంది. అందువల్ల ప్రపంచం దాని గురించి సంతోషిస్తుంది' అని ప్రధాన మంత్రి అన్నారు. 'చరిత్రలో భారతదేశం ప్రపంచ వృద్ధికి ఒక శక్తిగా ఉంది. కానీ భారతదేశం బానిసత్వాన్ని చూసింది. పారిశ్రామిక విప్లవాల ప్రయోజనాన్ని పొందలేకపోయింది. ఇప్పుడు ఇది పరిశ్రమ 4.0 కు సమయం. మేము ఇకపై బానిసలుగా లేము. దేశం పరిశ్రమ 4.0కి అవసరమైన నైపుణ్యం, మౌలిక సదుపాయాలను నిర్మించడానికి కృషి చేస్తున్నాం' అని మోదీ చెప్పారు. 'పేదరికం సవాళ్లను మేము అర్థం చేసుకున్నాం. పురోగతికి మార్గం ఎలా చేయాలో కూడా మాకు తెలుసు. మా ప్రభుత్వం వేగంగా విధానాలను రూపొందిస్తోంది. నిర్ణయాలు తీసుకుంటుంది. కొత్త సంస్కరణలను చేపడుతోంది' అని ఆయన అన్నారు. వివిధ ఆందోళనల్లో మునిగిన ప్రపంచానికి భారత్ ఆశలు కల్పిస్తోందని, ప్రతి రంగంలో అపూర్వమైన స్థాయిలో, వేగంతో పనిచేస్తోందని మోదీ అన్నారు. తన ప్రభుత్వ మూడవ పదవీ కాలంలో పని వేగం కారణంగా అనేక సంస్థలు భారతదేశ వృద్ధి అంచనాను సవరించాయని ఆయన అన్నారు. 'భారతదేశం ఆలోచన, విధానంలో మార్పును మీరు గమనించవచ్చు. ఇప్పుడు మేము గడిచిన కాలాన్ని పోల్చి, మా విజయాలపై విశ్రాంతి తీసుకోవాలనుకోవడం లేదు. కొత్త విధానంతో మా లక్ష్యం గురించి మేము ముందుకు సాగుతున్నాం' అని అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ తీర్మానం ఈ ఆలోచనను తెలియజేస్తోందని మోదీ అన్నారు. నేడు భారతదేశం ప్రపంచంలోని అత్యంత యువ దేశాల్లో ఒకటిగా ఉందని, ఈ యువ దేశం సామర్థ్యం మనల్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లగలదని తెలిపారు. '21వ శతాబ్దపు ప్రస్తుత కాలాలు మానవ చరిత్రలో అత్యంత ముఖ్యమైనవి. స్థిరత్వం, సుస్థిరత, పరిష్కారాల అవసరం ఉంది. మానవాళికి మెరుగైన భవిష్యత్ రెండు రోజులపాటు జరగనున్న ఈ సదస్సులో బ్రిటన్ మాజీ ప్రధాని డేవిడ్ కామరూన్, భూటాన్ ప్రధాని దాసో త్సేరింగ్ టోబ్గే, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 1-19 మధ్య

ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దు

వేర్పాటువాది పన్నూ హెచ్చరిక

న్యూఢిల్లీ: దేశంలో గత కొన్ని రోజులుగా విమానాలకు వరుసగా బాంబు బెదిరింపులు రావడం భయాందోళన కలిగిస్తోంది. ఇలాంటి పరిణామాల నేపథ్యంలో ఖలిస్థానీ వేర్పాటువాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ... 'ఎయిర్ ఇండియా'కు హెచ్చరికలు చేయడం తీవ్ర కలకలం రేపింది. నవంబరు 1 నుంచి 19వ తేదీల మధ్యలో ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దని అతడు హెచ్చరించడం ఆందోళన కలిగించే అంశం. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పన్నూ అన్నాడు. అందులో ఆయా తేదీల్లో ఆ సంస్థ విమానాల్లో ప్రయాణించొద్దంటూ ఓ వీడియో సందేశంలో పేర్కొన్నాడు. కాగా... పన్నూ ఇలాంటి హెచ్చరికలు చేయడం ఇది తొలిసారి కాదు. గత నవంబరులోనూ ఇలాంటి వీడియో విడుదల చేశాడు. నవంబరు 19న దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆ రోజు మూతపడుతుందని, దాని పేరు కూడా మార్చేస్తామని గతేడాది అతడు ఓ వీడియోలో హెచ్చరించాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థను 2007లో స్థాపించగా... వ్యవస్థాపకుల్లో గురుపత్వంత్ సింగ్ పన్నూ కూడా ఒకడు. ఈ సంస్థను భారత్ 2019లోనే నిషేధించింది. చట్టవ్యతిరేక కార్యకలాపాల చట్టం కింద భారత ప్రభుత్వం అతడిని 2020లో ఉగ్రవాదిగా ప్రకటించింది. ప్రస్తుతం అతడు అమెరికాలో ఉన్నట్లు సమాచారం. పన్నూకు అగ్రరాజ్యంతో పాటు కెనడా పౌరసత్వం కూడా ఉంది.

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలన్నదే సంకల్పం

అమిత్ షా

న్యూఢిల్లీ: దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిగా తుడిచిపెట్టాలనే సంకల్పంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. దిల్లీలో సోమవారం జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో ఆయన ప్రసంగించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కార్యకలాపాలను అణచివేయడానికి భారత బలగాలు గత పదేళ్లుగా శాయశక్తులా కృషి చేస్తున్నాయని... అయినప్పటికీ ఉగ్రవాదంపై యుద్ధం ఇంకా ముగియలేదన్నారు. డ్రగ్స్, భారత వ్యతిరేక చర్యలు, ఉగ్రవాదాన్ని తుడిచిపెట్టడానికి ఎన్డీఏ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. 2047 నాటికి భారత దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశాన్ని రక్షించడానికి 36,468 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని... వారి త్యాగాల వల్లే దేశం సురక్షితంగా ఉందని అమిత్ షా పేర్కొన్నారు. గత ఏడాది కాలంలో దాదాపు 216 మంది పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. వీరి త్యాగాలను దేశం ఎప్పటికీ మరిచిపోదన్నారు. 'మా పదేళ్ల పాలనలో జమ్ము కశ్మీర్, వామపక్ష అతివాద ప్రభావిత ప్రాంతాల్లో శాంతి నెలకొంది. అయినా మా పోరాటాన్ని ఆపం. కశ్మీర్‌లో మాదక ద్రవ్యాలు, సైబర్ నేరాలు, మతపరమైన ఉద్రిక్తతలను సృష్టించే కుట్రలు, చొరబాట్లకు పాల్పడుతున్న ఉగ్రవాదులకు వ్యతిరేకంగా పోరాడుతూనే ఉంటాం' అని అమిత్‌షా అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులకు ఆయన నివాళులర్పించారు. 1959లో లడఖ్‌లో చైనా సైనికులు జరిపిన ఆకస్మిక దాడిలో మరణించిన పోలీసులు, ఇతర అధికారుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబరు 21న పోలీసు సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఒమర్ అబ్దుల్లా కీలక నిర్ణయం

బుద్గాం స్థానాన్ని వదులుకున్న సీఎం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కీలక నిర్ణయం తీసుకున్నారు. బుద్గాం అసెంబ్లీ స్థానాన్ని ఆయన వదులుకున్నారు. కుటుంబానికి కంచుకోటగా ఉన్న గందర్‌బల్ స్థానాన్ని నిలుపుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఒమర్ అబ్దుల్లా రెండు అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేసి విజయం సాధించారు. దీంతో ఒక స్థానాన్ని వదులుకోవల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో బుద్గాం స్థానాన్ని ఖాళీ చేయడంతో ఇక్కడ త్వరలో ఉప ఎన్నిక రానుంది. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ -కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. ఈనెల 16న ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వం ఏర్పడింది. గందర్‌బల్ నుంచి 10,574 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందగా.. బుద్గాం నుంచి 18,485 ఓట్ల ఆధిక్యంతో ఒమర్ గెలుపొందారు. ఒమర్ అబ్దుల్లా గందర్‌బాల్ నియోజకవర్గాన్ని నిలబెట్టుకున్నట్లు జమ్మూకశ్మీర్ ప్రొటెం స్పీకర్ ముబారక్ గుల్ సభలో ప్రకటించారు. పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) అభ్యర్థి అగా సయ్యద్ ముంతజీర్ మెహదీపై 18,485 ఓట్లతో ఒమర్ విజయం సాధించారు. నేషనల్ కాన్ఫరెన్స్ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్లా కుటుంబానికి గందర్‌బాల్ నియోజకవర్గం బలమైన కోటగా ఉంది. ఒమర్ అబ్దుల్లా 2009 నుంచి 2014 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గందర్‌బల్ నుంచి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి ఎన్సీని స్థాపించిన అతని తండ్రి ఫరూఖ్ అబ్దుల్లా , తాత షేక్ అబ్దుల్లా ప్రాతినిధ్యం వహించారు. ఒమర్ అబ్దుల్లా.. బుద్గాంను ఖాళీ చేయడంతో 95 మంది సభ్యుల సభలో నేషనల్ కాన్ఫరెన్స్ బలం 41కి తగ్గింది. అయితే ఎన్సీ ప్రభుత్వానికి ఇప్పటికీ ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఐదుగురు స్వతంత్రులు, ఆప్ మరియు సీపీఐకి చెందిన ఒక్కొక్క ఎమ్మెల్యే మద్దతుతో మెజారిటీ ఉంది.

427 కిలోల డ్రగ్స్ స్వాధీనం... ఒకరి అరెస్ట్

అహ్మదాబాద్: గుజరాత్‌లోని భరూచ్ జిల్లాలో అంక్లేశ్వర్ ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ ఫ్యాక్టరీ నుంచి నిషేధిత మెథాంఫెటమైన్, 427 కిలోల ఇతర డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత మెథాంఫెటమైన్ విలువ రూ.14 లక్షలు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో ఒకరిని అరెస్టు చేశారు. అంక్లేశ్వర్ జీఐడీసీ ప్రాంతంలో ఉన్న అవసార్ ఎంటర్‌ప్రైజ్ నుంచి ఈ డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ పదార్థాల నిర్ధారణ కోసం ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీకి పంపించారు. భరూచ్ జిల్లా, సూరత్ పోలీసుల బృందం ఆదివారం రాత్రి ఫ్యాక్టరీపై దాడి చేసినట్లు స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆనంద్ చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా రూ.14.10 లక్షల విలువైన 141 గ్రాముల ఎండీని స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటి వరకు ఒకరిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. అంతకుముందు ఈ నెల 13న గుజరాత్ -దిల్లీ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించి అంక్లేశ్వర్‌లోని అవ్కార్ డ్రగ్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీ నుంచి రూ.ఐదువేల కోట్ల విలువైన 500 కిలోలకు పైగా కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనికి కొద్ది రోజుల ముందు దిల్లీ పోలీసులు రాజధానిలోని గోదాముపై దాడి చేసి 562 కిలోల కొకైన్, 40 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రమేష్ నగర్‌లోని ఓ దుకాణంపై దాడి చేయగా, అక్కడ 208 కిలోల కొకైన్ లభ్యమైంది. ఈ నిషేధిత డ్రగ్స్ అంకాలేశ్వర్‌కు చెందిన అవ్కార్ డ్రగ్స్ లిమిటెడ్ కంపెనీ నుంచి వచ్చిన ఫార్మా సొల్యూషన్ సర్వీసెస్ కంపెనీకి చెందినదని విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. గుజరాత్ తీర ప్రాంతానికి చేరువలో ఉన్న క్రమంలో సులంభంగా దుండగులు అక్రమంగా డ్రగ్స్ రవాణా చేసి దేశంలో విక్రయించేందుకు సిద్ధమవుతున్నారని అధికారులు భావిస్తున్నారు.

యువత... ఉక్కు చరిత్ర తెలుసుకో...

- ప్రైవేటీకరిస్తామంటే సహించేది లేదు
- 'ఉక్కు దీక్ష-బహిరంగ సభ'లో హర్షకుమార్, ముప్పాళ్ల

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : విశాఖ ఉక్కుకు పోరాట చరిత్ర ఉందని, అనేక మంది ప్రాణ త్యాగాలు, పదవీ త్యాగాల ద్వారా విశాఖ ఉక్కు పరిశ్రమ స్థాపించారని వక్తలు పేర్కొన్నారు. నేటి యువత ఈ ఉక్కు చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించి విశాఖ ఉక్కు చరిత్రను సోధించవచ్చని సూచించారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు జరిగే పోరాటంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ఉద్యమానికి స్పూర్తినిచ్చిన తాడికొండ మాజీ ఎమ్మెల్యే తమనంపల్లి అమృతరావు 103వ జయంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి అమరావతి రోడ్డులోని అమృతరావు సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ అమృతరావు 103వ జయంతి ఉత్సవ కమిటీ ఛైర్మన్ టి.అమృతరాజ్ ఆధ్వర్యంలో 'ఉక్కు దీక్షలు-బహిరంగ సభ' నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో మాజీ ఎంపీ హర్షకుమార్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జడ్పీ మాజీ ఛైర్మన్ కూచిపూడి విజయ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ 26 రోజులు ఆమరణ నిరాహార దీక్షలు చేసిన అమృతరావు విశాఖ ఉక్కును సాధించడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. దేశంలోని నవరత్నాలలో ఒక రత్నంగా ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. లాభాల బాటలో నడుస్తూ లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించకుండా నష్టాలలోకి నెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పాలకులు సైతం ద్వంద్వ వైఖరి అవలంబిస్తూ... కబుర్లతో కాలక్షేపం చేసున్నదని విమర్శించారు. ఉక్కు పరిరక్షణకు నిర్దిష్టమైన ప్రణాళిక ఎందుకు రూపొందించడం లేదని ప్రశ్నించారు. టీడీపీ, వైసీపీ శ్రేణులు ఉద్యమంలో భాగస్వాములయ్యే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఉక్కు పరిరక్షణకు రాజీనామాలు చేసి ఉద్యమంలో కలిసిరావాలని పిలుపునిచ్చారు. లేనిపక్షంలో ప్రజలు నిలదీసే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఉద్యమం జరుగుతున్న నేపథ్యంలో అమృతరావు 103వ జయంతి సందర్భంగా అందరిలో స్ఫూర్తిని రగిల్చేందుకు ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టిన అమృతరావు కుటుంబ సభ్యులను వక్తలు అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ విశాఖ నగర భౌగోళిక, ఆర్థిక పరిస్థితులు మారడానికి ఉక్కు పరిశ్రమ ఒక కారణమని, అటువంటి పరిశ్రమను కాపాడుకోవడానికి స్పష్టమైన వైఖరి, నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని అన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏపీ ఎన్జీఓ సంఘం నాయకులు మూర్తి, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నాగరాజు, ప్రముఖ న్యాయవాది పాల్, గంగోలు శామ్యూల్, యర్రా రామకృష్ణ తదితరులు మాట్లాడారు. తొలుత ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నగర కార్యదర్శి చెవుల పున్నయ్య గేయాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు ప్రభుత్వం న్యాయం చేయాలి

గౌరవ వేతనం రూ.10 వేలు ఇవ్వాలి : ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: వలంటీర్లకు న్యాయం చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల హామీ నిలబెట్టుకుని నిబద్ధత చాటుకోవాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య కోరారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వలంటీర్లు రాష్ట్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. విజయవాడలో దాసరి భవన్ వద్ద , మచిలీపట్నంలో కలెక్టరేట్ వద్ద వలంటీర్లు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఈశ్వరయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు గడుస్తున్నా వలంటీర్లకు ఇచ్చిన మాట నిలబెట్టు కోలేదన్నారు. ఈ నెల 23న జరగనున్న కేబినేట్ సమావేశంలో వలంటీర్లకు న్యాయం చేయాలని లేకుంటే అన్నీ జిల్లాలలో వలంటిర్లను సమీకరించి 'చలో సీఎం క్యాంప్ కార్యాలయం' చేపడతామని హెచ్చరించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ ఎన్నికల హామీల ప్రకారం ప్రతి వలంటీర్‌కి రూ.10 వేలు గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గి రాజీనామా చేసిన వలంటీరన్లు తిరిగి కొనసాగించాలని, 4 నెలల గౌరవ వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వార్డు వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని, గ్రామ వార్డు సచివాలయాల్లో వలంటీర్ల హాజరుని క్రమబద్ధీకరించాలని కోరారు. వలంటీర్లకు న్యాయం చేయకపోతే అన్ని జిల్లాల వలంటరీలను సంఘటితం చేసి భారీ ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లంకా గోవింద రాజులు, నాయకులు లంకె సాయి, శింగంశెట్టి మోహన్ ప్రసాద్, హరీశ్, గాడి అజయ్, మమత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీ నెరవేర్చండి: జంగాల చైతన్య

ఎన్నికల సమయంలో వలంటీర్స్‌కు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జంగాల చైతన్య డిమాండ్ చేశారు. వలంటీర్స్‌కు న్యాయం చేయాలని కోరుతూ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలియజేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య మీడియాతో మాట్లాడుతూ వలంటీర్లను యధావిధిగా కొనసాగించాలని, రూ.10 వేలు వేతనం ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు కోలా రాజేష్, వెంకట్, నాగరాజ్, రమేష్, బాజీ, నజీర్, పుష్ప, తిరుపతమ్మ, బిందు, సతీష్, దాస్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

ధర్నాలో ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర-మంగళగిరి: ప్రభుత్వాలు ప్రకటిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకుపోయి ప్రజలకు చేరవేయటంలో విశేషమైన కృషి చేస్తూ... పట్టణాలు, గ్రామాలలో గర్భవతులు, బాలింతలు, నవజత శిశువులకు వైద్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్లకు వేతన పెంపు, ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఏపీఐఐసీ బిల్డింగ్ వద్దకు సోమవారం చేరుకున్న ఆశ వర్కర్లు అక్కడ బైఠాయించి మెరుపు ధర్నా నిర్వహించారు. తొలుత పట్టణంలోని ఎన్నారై హాస్పిటల్ నుంచి గౌతమ బుద్ధ రోడ్డు మీదగా ఆటోనగర్‌లోని ఏపీఐఐసీ బిల్డింగ్ వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం బిల్డింగ్ వద్ద ధర్నాకు దిగారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అడిషినల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ అనిల్ కుమార్‌కు అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.

ధర్నా చేస్తున్న వారినుద్దేశించి ఓబులేసు మాట్లాడుతూ, రాష్ట్రంలో ఆశ వర్కర్లు చేస్తున్న కృషికి ఫలితం లేకుండా రాష్ట్ర ప్రభుత్వాలు ఆశ వర్కర్లను తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అధికారులు ఆశా వర్కర్లను అదనపు పనులు చేయాలని ఒత్తిడి చేస్తున్నారనీ, వేధింపులకు గురిచేస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్, ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్.శాంతి మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.6 వేలు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఆశ వర్కర్లపై రాజకీయ నాయకులు, అధికారుల వేధింపులు తక్షణమే ఆపివేయాలని, ఆశ వర్కర్లకు ట్రైనింగ్ ఇచ్చి ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు పి.సుభాషిని, ఎస్.వెంకటేశ్వరరావు, గోపాల్, అమ్ములు, నాగమణి, చంద్రశేఖర్, చందా మైర్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి హడ్కో రుణం రూ.11వేల కోట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అమరావతి రాజధాని నిర్మాణం కోసం వివిధ బ్యాంకులు,సంస్థలు తమ సహకారం అందించేందుకు అంగీకరిస్తున్నాయి. ఇప్పటికే ప్రపంచ బ్యాంకు,ఆసియా డెవలప్ మెంట్ బ్యాంకు కలిసి 15 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకారం తెలపగా, తాజాగా 11 వేల కోట్ల నిధుల మంజూరుకు హడ్కో అంగీకారం తెలిపింది.సోమవారం దిల్లీలో పర్యటించిన మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ,ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ హడ్కో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ సీఈవో సంజయ్ కుల్ శ్రేష్ఠ,హడ్కో విజయవాడ రీజినల్ చీఫ్ బీఎస్ ఎన్ మూర్తి పాల్గొన్నారు. అమరావతి నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ ఆలోచనను హడ్కో అధికారులకు పూర్తి స్థాయిలో మంత్రి నారాయణ వివరించారు. ప్రభుత్వ ప్రతిపాదనలకు సంతృప్తి చెందిన హడ్కో సీఈవో అమరావతి నిర్మాణం కోసం ఏపీసీఆర్డీయేకు 11 వేల కోట్ల రుణం మంజూరుకు అంగీకారం తెలిపారు. రాజధాని నిర్మాణంలో ప్రభుత్వ భవనాల కాంప్లెక్స్,ల్యాండ్ పూలింగ్ ద్వారా రైతులకు ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లలో మౌలిక వసతులు అభివృద్ధి,రోడ్లు,డ్రైనేజి,తాగునీటి సదుపాయం వంటి ట్రంక్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ వంటి మిగిలిన పనుల పూర్తికి 50 వేల కోట్ల ఖర్చవుతుందని అంచనా వేసారు. అయితే వీటిలో మొదటి విడత పనుల పూర్తికి 26 వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేయగా, ఈ నిధుల సమీకరణ కోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దృష్టిసారించింది.

మచిలీపట్నం వైద్యకళాశాలకు పింగళి పేరు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలకు శ్రీపింగళి వెంకయ్య ప్రభుత్వ వైద్య కళాశాలగా ప్రభుత్వం పేరు మార్చింది. గత ప్రభుత్వ హయాంలో మచిలీపట్నంలో వైద్య కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కళాశాల పేరు మార్పు చేశారు. ఈ మేరకు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రధాని మోదీ డిగ్రీ కేసులో కేజ్రీవాల్ పిటిషన్ తిరస్కృతి

న్యూఢిల్లీ: దిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత అరవింద్ కేజ్రీవాల్... ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విద్యార్హతలపై తాను చేసిన వ్యాఖ్యలపై దాఖలయిన నేర పరువునష్టం కేసును సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు సోమవారం కొట్టివేసింది. గుజరాత్ విశ్వవిద్యాలయం దాఖలు చేసిన పరువు నష్టం కేసు... కేజ్రీవాల్ బహిరంగంగా, విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై దాఖలయింది. ఇక్కడ ఆయన ప్రధాని మోదీ విద్యా అర్హతలు, ప్రత్యేకంగా గుజరాత్ విశ్వవిద్యాలయం నుంచి మోదీ పొందిన డిగ్రీ చెల్లుబాటును ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలను గుజరాత్ విశ్వవిద్యాలయం అవమానకరమైనదిగా, దాని ప్రతిష్ఠకు భంగం కలిగించేదిగా భావించింది. తత్ఫలితంగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ పీయూష్ పటేల్... కేజ్రీవాల్, ఆప్ నాయకుడు సంజయ్ సింగ్ ఇద్దరిపై నేర పరువు నష్టం దావా వేసింది. పారదర్శకత కోసం కేజ్రీవాల్ చేసిన డిమాండ్‌కు ప్రతిస్పందనగా కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) దిల్లీ విశ్వవిద్యాలయం, గుజరాత్ విశ్వవిద్యాలయాలను ప్రధాని మోదీ డిగ్రీకి సంబంధించిన వివరాలను వెల్లడించాలని ఆదేశించడంతో 2016లో మొదటిసారిగా ఈ కేసు రూపుదిద్దుకుంది. అయితే తదనంతరం గుజరాత్ హైకోర్టు జులై 2016లో సీఐసీ ఉత్తర్వును పక్కనబెడుతూ సమాచారాన్ని విడుదల చేయకుండా అడ్డుకుంది. ఫిబ్రవరిలో గుజరాత్ హైకోర్టు ఆయన మునుపటి పిటిషన్‌ను కొట్టివేసిన తర్వాత కేజ్రీవాల్ సుప్రీం కోర్టుకు చేసిన ప్రస్తుత అభ్యర్థన వచ్చింది. ప్రధాని మోదీ విద్యార్హతలపై తాను చేసిన వ్యాఖ్యలపై విచారణకు హాజరు కావాలని గుజరాత్‌లోని ట్రయల్ కోర్టు తనపై జారీ చేసిన నేర పరువు నష్టం సమన్లను రద్దు చేయాలని ఆయన కోరారు. సహ నిందితుడు సంజయ్ సింగ్ కూడా విచారణను సవాలు చేస్తూ ఇదే విధమైన పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే న్యాయమూర్తులు జస్టిస్ హృషికేష్ రాయ్, ఎస్.వి.ఎన్.భట్టితో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం కేజ్రీవాల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

జార్ఖండ్ కొత్త డీజీపీగా ఎ.కె.సింగ్

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈసీ చర్య

న్యూఢిల్లీ: జార్ఖండ్ కేడర్ సీనియర్ ఐపీఎస్ అధికారి అజయ్ కుమార్ సింగ్‌ను రాష్ట్ర డీజీపీగా ఎన్నికల సంఘం సోమవారం నియమించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. తాత్కాలిక పోలీసు ప్రధానాధికారిగా ఉన్న అనురాగ్ గుప్తాను తొలగించిన కొన్ని రోజుల తరువాత ఎన్నికల సంఘం ఈ చర్య తీసుకుంది. ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) 1989 బ్యాచ్‌కు చెందిన అధికారి అయిన సింగ్ ముగ్గురు ఐపీఎస్ అధికారుల ప్యానెల్ నుంచి ఎంపికయ్యారు. వీరి పేర్లను రాష్ట్ర ప్రభుత్వం పంపింది. గత ఎన్నికలకు సంబంధించిన దుష్ప్రవర్తనకు సంబంధించిన 'చరిత్ర' కారణంగా తాత్కాలిక డీజీపీ అనురాగ్ గుప్తాను తొలగించాలని ఎన్నికల అధికారం శనివారం ఆదేశించిన తర్వాత పేర్లను పంపారు. రాష్ట్రంలో నవంబరు 13, 20 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి గుప్తాకు జులై 26న అప్పటి డీజీపీగా ఉన్న సింగ్ స్థానంలో బాధ్యతలు అప్పగించారు. సింగ్ తన ముందున్న నీరజ్ సిన్హా పదవీ విరమణ తర్వాత ఫిబ్రవరి 2023లో రాష్ట్ర డీజీపీగా నియమితులయ్యారు. జార్ఖండ్ ప్రభుత్వం, మాజీ పోలీసు ప్రధానాధికారి నీరజ్ సిన్హాపై దాఖలయిన ధిక్కార పిటిషన్‌ను 2023 జనవరిలో సుప్రీం కోర్టు కొట్టివేసినందున, సింగ్ నియామకంతో గత సంవత్సరం రాష్ట్ర డీజీపీ నియామకంపై వివాదానికి తెరపడింది. జనవరి 31, 2022న పదవీ విరమణ చేసిన తర్వాత కూడా సిన్హా డీజీపీ పదవిలో కొనసాగుతున్నారని ఒక పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం, యూపీఎస్సీ అందించిన అభ్యర్థనలకు హాజరు కావాలని రాష్ట్రాన్ని ఆదేశించింది. జులై 14, 2021న కోర్టు తన తీర్పును ఉల్లంఘించినందుకు రాష్ట్ర ప్రభుత్వం, దాని ఉన్నతాధికారులు, యూపీఎస్సీపై ధిక్కార పిటిషన్‌పై నోటీసులు జారీ చేసింది. యూపీఎస్సీ తయారు చేయాల్సిన జాబితా నుంచి ఎంపిక చేయాల్సిన రాష్ట్ర పోలీసు ప్రధానాధికారికి రెండేళ్ల నిర్దిష్ట పదవీకాలానికి సంబంధించిన తీర్పును ఉల్లంఘించారని ఆరోపిస్తూ, సెప్టెంబరు 3, 2021న తాత్కాలిక డీజీపీ నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం, యూపీఎస్సీ పాత్రను సుప్రీం కోర్టు తప్పు పట్టింది. జులైలో గుప్తా నియామక నోటిఫికేషన్ వెలువడిన వెంటనే డీజీపీ నియామకంపై జేఎంఎం నేతృత్వంలోని పాలక కూటమిలో చీలిక వచ్చింది. 'ఇటువంటి ప్రధాన నిర్ణయం' తీసుకునేటప్పుడు కూటమి భాగస్వాములను విశ్వాసంలోకి తీసుకోలేదని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ ఠాకూర్ అన్నారు. ఈ నెల ప్రారంభంలో తదుపరి డీజీపీగా పేరుపొందిన అధికారిని ఎంపిక చేసేందుకు వీలుగా సీనియర్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారుల పేర్ల ప్యానెల్‌ను అక్టోబరు 21 ఉదయం లోపు సమర్పించాలని ఈసీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) పక్షపాత ప్రవర్తన ఆరోపణలను అనుసరించి గుప్తాను జార్ఖండ్ ఏడీజీ (స్పెషల్ బ్రాంచ్) బాధ్యతల నుంచి తొలగించారు. దిల్లీలోని రెసిడెంట్ కమిషనర్ కార్యాలయానికి ఆయనను మళ్లీ కేటాయించారని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు జార్ఖండ్‌కు తిరిగి రాకుండా నిషేధించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2016లో జార్ఖండ్‌లో జరిగిన రాజ్యసభ ఎన్నికల సందర్భంగా అప్పటి అదనపు డీజీపీ గుప్తా అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్నారు. కమిషన్ విచారణ కమిటీని ఏర్పాటు చేసి శాఖాపరమైన విచారణ కోసం ఆయనకు ఛార్జ్‌షీట్ జారీ చేసింది.

ఆదుకుంటాం... ఆందోళన వద్దు

డయేరియా బాధితులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భరోసా

విశాలాంధ్ర-విజయ నగరం: విజయనగరం జిల్లా గుర్ల మండల కేంద్రంలో డయేరియా బాధితులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం పరామర్శించారు. గ్రామంలో డయేరియా విజృంభించి దాదాపు 13మంది వరకు మరణించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈవిషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమీక్ష చేయగా పవన్ కల్యాణ్ నేరుగా గ్రామానికి వచ్చి చికిత్స పొందుతున్న బాధితులను, మృతి చెందినవారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ముందుగా ఆయన గుర్ల గ్రామానికి నీటి సరఫరా అవుతున్న నెల్లిమర్ల లోని చంపావతి నదిలో ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. అధికారులను అనేక విషయాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించి వారికి అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. అనంతరం బాధితులకు ధైర్యం చెబుతూ ఆందోళన చెందకండి మీకు మేమున్నాం అని భరోసా ఇచ్చారు. అనంతరం గుర్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో స్థానిక మహిళలతో మాట్లాడారు. మహిళలు తమ సమస్యలను విన్నవించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చెప్పిన పవన్ తన సొంత నిధుల నుంచి మృతి చెందిన వారికుటుంబానికి రూ.లక్ష చొప్పున ఇవ్వనున్నట్లుగా ప్రకటించారు. డయేరియా మరణాల ఘటనపై ప్రభుత్వం విచారణకు సీనియర్ ఐఏఎస్ విజయానంద్‌ను నియమించిందని తెలిపారు. విచారణ నివేదిక అందిన తర్వాత ప్రభుత్వం తరపున పరిహారం ప్రకటిస్తామన్నారు. అనంతరం డయేరియా మరణాలపై జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. తగిన విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చంపావతి నది పరివాహక ప్రాంతాలలో చెత్తా చెదారం పడేస్తున్నారని.. గుర్ల గ్రామంలో బహిరంగ మలవిసర్జన ఎక్కువగా ఉందని పవన్ తెలిపారు. దీనిని ఆపకపోతే ఆరోగ్య పరంగా చాలా వరకు నష్టపోయే అవకాశం ఉందన్నారు. గత అయిదేళ్లలో ఎలాంటి డబ్బులు ఖర్చు చెయ్యలేదని.. పంచాయితీ నిధులు విడుదల చెయ్యలేకపోయారని విమర్శించారు. గత అయిదేళ్లలో కనీసం ఫిల్టర్స్ కూడా మార్చలేకపోయారన్నారు. రుషి కొండ ప్యాలెస్ కట్టారు కాని ఇలాంటి రక్షిత నీరు అందించటానికి కావల్సిన ఫిల్టర్లను మార్చలేకపోయారని మండిపడ్డారు. గత ప్రభుత్వం కనీసం మంచి నీరు అందించలేకపోయిందని విమర్శించారు.

వాంగ్‌చుక్ దీక్ష విరమణ

డిసెంబరు 3న లడ్డాఖ్ గ్రూపులతో భేటీకి కేంద్రం హామీ

న్యూఢిల్లీ: లడ్డాఖ్ డిమాండ్లపై చర్చలను డిసెంబరులో తిరిగి ప్రారంభిస్తామని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ హామీ ఇవ్వడంతో వాతావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ సోమవారం తన నిరాహార దీక్షను ఇతరులతో పాటు ముగించారు. అక్టోబరు 6 నుంచి దిల్లీలోని లడ్డాఖ్ భవన్‌లో నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న కార్యకర్తలను జమ్మూకశ్మీర్, లడ్డాఖ్ జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ లోఖండే కలుసుకుని హోం మంత్రిత్వ శాఖ నుంచి ఒక లేఖను అందజేశారు. లడ్డాఖ్‌కు చెందిన ప్రతినిధులతో చర్చలు జరుపుతున్న మంత్రిత్వ శాఖ ఉన్నతస్థాయి కమిటీ తదుపరి సమావేశాన్ని డిసెంబరు 3న నిర్వహిస్తుందని లేఖలో పేర్కొన్నారు. దీని తరువాత వాంగ్‌చుక్, ఆయన మద్దతుదారులు తమ నిరాహార దీక్షను విరమించాలని నిర్ణయించుకున్నారు.

రేపు వయనాడ్ ఉప ఎన్నికకు ప్రియాంక గాంధీ నామినేషన్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తొలిసారి ఎన్నికల్లో పోటీకి సిద్ధమయ్యారు. సోదరుడు రాహుల్ గాంధీ రాజీనామా చేసిన కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికకు ఈ నెల 23న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గేతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కాగా, ఖడ్గే, తల్లి సోనియా, రాహుల్, కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకులు కూడా నామినేషన్ కార్యక్రమానికి హాజరవుతారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కలెక్టర్ ఎదుట యూడీఎఫ్ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేస్తారని పేర్కొన్నారు. తొలుత ఉదయం 11 గంటలకు కల్పేట కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు రాహుల్ గాంధీతో కలిసి ప్రియాంక గాంధీ రోడ్‌షో నిర్వహిస్తారని వెల్లడించారు. ప్రియాంక గాంధీ (52) ఐదేళ్ల కిందట కాంగ్రెస్ క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. అయితే వయనాడ్ నుంచి తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. జమ్మూకశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన కాంగ్రెస్ పార్టీ, ప్రియాంక గాంధీ విజయంతో దాని నుంచి బయటపడాలని, వయనాడ్ స్థానాన్ని నిలుపుకోవాలని భావిస్తోంది.

గడ్చిరోలి జిల్లాలో ఎదురుకాల్పులు... ఐదుగురి మృతి

ముంబై : మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా కోప్రి అటవీ ప్రాంతంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఒక జవానుకు గాయాలయ్యాయి. అతడిని చికిత్స కోసం నాగ్‌పూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కోప్రి అటవీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ కమాండో టీమ్ కూంబింగ్ జరుపుతుండగా మావోయిస్టులు ఎదురుపడ్డారు. దాంతో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. గడ్చిరోలిలో మావోయిస్టులు ఎక్కువగా సంచరిస్తున్నారు. ఇటీవల మావోయిస్టు దంపతులు రూ.ఎనిమిది లక్షల రివార్డు తీసుకుని పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిని అసిన్ రాజారామ్ కుమార్ (37) అలియాస్ అనిల్, అతడి భార్య అంజు సుళ్య జాలే (28) అలియాస్ సోనియాగా గుర్తించారు. రాజా రామ్ కుమార్ ఒడిశాలోని మావోయిస్టుల ప్రెస్ టీమ్‌లో ఏరియా కమిటీ సభ్యుడు అని పోలీసులు తెలిపారు. అతడు హర్యానాలోని నర్వానా గ్రామానికి చెందినవాడు. హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లా సమీపంలోని ఓ ప్రాంతంలో నకిలీ గుర్తింపుతో నివసిస్తున్నాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.